



బైఠాయించిన సిపిఎం నాయకులు , అధికారులతో ఫోన్‌లో సంప్రదిస్తున్న ఎమ్మెల్యే

కర్ణాటకలో వర్షాలు కురవక...

తుంగభద్ర డ్యాం వెలవెల

- నీటి నిల్వ 4 టిఎంసిలు మాత్రమే - ఎల్‌ఎల్‌సి కింద సాగు ప్రశ్నార్థకమే

ప్రజాశక్తి - హోళగుంద

కర్ణాటక రాష్ట్రంలో ఇప్పటివరకు మంచి వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర డ్యాం వెలవెలబోతోంది. డ్యాంలో కేవలం 4 టిఎంసిల నీరు మాత్రమే నిల్వ ఉంది. డ్యాంలో నీరు లేకపోవడంతో ఎల్‌ఎల్‌సి కింద వరిసాగు ప్రశ్నార్థకంగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కర్ణాటక రాష్ట్రంలో ఇప్పటివరకు మంచి వర్షాలు కురవకపోవడంతో తుంగభద్ర డ్యాం వెలవెలబోతోంది. వరద ప్రవాహం లేక గతేడాదికి సంబంధించిన నీరు కేవలం 4 టిఎంసిలు మాత్రమే ఉంది. ఈఏడాది ఎల్‌ఎల్‌సి కింద వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది. గతేడాది జూన్ 15 నాటికి 50 టిఎంసిల నీరు నిల్వ ఉండేది. ఈఏడాది వర్షాల్లేక జీరో ఇన్‌ఫ్లో కొనసాగడం ఇదే మొట్టమొదటిసారి అని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.

తాగు, సాగునీరు ప్రశ్నార్థకమే

కర్ణాటకలోని శివమొగ్గ, చిక్క మంగళూరు, చిత్రదుర్గ, ధవనగిరి తదితర ప్రాంతాల్లో మంచి వర్షాలు కురవలేదు. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో రాకపోతే తాగు, సాగునీరు కూడా ఈ ఏడాది ప్రశ్నార్థకంగా మారుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. కర్ణాటకతోపాటు ఆంధ్ర రాష్ట్రంలోనూ ఎల్‌ఎల్‌సి కాల్వ కింద లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తారు. జూన్ నెల 16 దాటుతున్నా ఇంతవరకు తుంగభద్ర డ్యాంకు చుక్క నీరు కూడా చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



తుంగభద్ర డ్యాం (ఫైల్)

డ్యాం కెపాసిటీ 105 టిఎంసిలు

తుంగభద్ర డ్యాం కెపాసిటీ 105 టిఎంసిలు. ఈ ఏడాది కర్ణాటక రాష్ట్రంలో వర్షాలు కురవకపోవడంతో ఒక్క చుక్క వరద నీరు కూడా డ్యాంకు చేరలేదు. డ్యాం అధికారులతో పాటు డ్యాం నీటిపై ఆధారపడిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యాంలో కేవలం 4 టిఎంసిల నీటి నిల్వ మాత్రమే ఉంది. ఇంకో 15 రోజులు వర్షాలు కురవకపోతే ఉన్న నీరు కూడా ఆవిరైపోయే ప్రమాదం ఉందని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు.

గూడూరు నుంచి కోడుమూరుకు రోడ్డు వేయండి

- ఎమ్మెల్యేను అడ్డుకుని బైఠాయించిన సిపిఎం నాయకులు

- 10 రోజుల్లో టెండర్లు పిలుస్తామని ఎమ్మెల్యే సుధాకర్ హామీ

ప్రజాశక్తి-గూడూరు

గూడూరు చనగుండ్ల మీదుగా కోడుమూరు వరకు ఉన్న రహదారిని వెంటనే వేయాలని శనివారం చనగుండ్ల గ్రామంలో గడపగడప కార్యక్రమంలో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్‌కు సిపిఎం నాయకులు అడ్డుకున్నారు. రోడ్డుపై బటాయించి గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లకుండా నిలదీశారు. వారంరోజుల్లో రోడ్డు పనులకు టెండర్లు పిలుస్తామని హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు. సిపిఎం నాయకులు జయ మోహన్, కట్లయ్య, మాధవకృష్ణ మాట్లాడుతూ గూడూరు నుండి చనగుండ్ల మీదుగా కోడుమూరు వరకు ఉన్న రహదారి పూర్తిగా గుంతల మయం అయిందని, దాదాపు 15 సంవత్సరాలు అయినా ఈ రోడ్డు నిర్మాణం పనులు అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. చనుగుండ్ల గ్రామంలో గర్భిణీలు, బాలింతలు పేషెంట్లు, ప్రజలు ఈ రోడ్డు మార్గంలో హాస్పిటల్‌కు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ రోడ్డు మార్గంగా వెళ్లి హాస్పిటల్‌లో చేరేలోపు ప్రాణాపాయం స్థితికి చేరుకుంటున్నారన్నారు. రెండు మండలాలను కలిపే ఈ రహదారిని పాలకులు అధికారులు చూసుకుంటూ వెళ్లినా, ప్రభుత్వాలు మారినా అధికారులు మారినా మార్పు లేదన్నారు. ఈ రహదారిని ఎప్పుడు బాగు చేస్తారని ఎమ్మెల్యే సుధాకర్‌ను ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే స్పందిస్తూ రోడ్డు మంజూరు అయిందని, టెండర్లు ప్రక్రియ పది రోజుల్లో పూర్తి చేసి రోడ్డు నిర్మాణం పనులు చేపడతానని హామీ ఇచ్చారు. దీంతో సిపిఎం నాయకులు ధర్నాను విమరిమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజనేయులు, సుధాకర్, వెంకటేశ్వర్లు, మల్లేష్, రమేష్ , మహేంద్ర, భరత్, శివ, సుధాకర్ మహేష్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగ, కార్మికుల నిరసనలు

ప్రజాశక్తి-కర్నూలు ప్రత్యేక ప్రతినిధి

కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఈవారం కూడా ఉద్యోగ, కార్మికుల ఆందోళనలు కొనసాగాయి. విద్యుత్ విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించాలని సిపిఎం, ఇరత పార్టీల ఆధ్వర్యంలో కర్నూలు విద్యుత్ సౌధ ఎదుట, వివిధ సబ్‌స్టేషన్ల ఎదుట నిరసన తెలిపారు. విఆర్‌ఎలకు పేస్కేలు అమలు చేయాలని విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేశారు. కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో సదస్సు నిర్వహించారు. కాంట్రాక్టు అవుట్ సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ కార్మికుల సంఘం(సిఐటియు) ఆధ్వర్యంలో ప్రదర్శన చేసి మున్సిపల్ కమిషనర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. వైఎస్ఆర్‌టియు ఆధ్వర్యంలో కూడా కర్నూలు నగరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ముఖ్యమంత్రి జిందాబాద్ అంటూనే కాంట్రాక్టు అవుట్ సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని నిరసన తెలిపారు. అంగన్ వాడీల సమస్యలను పరిష్కరించాలని ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోని సిడిపిఒ కార్యాలయాల ఎదుట ధర్నాలు చేశారు. వారి సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని, సిపిఎస్‌ను రద్దు చేసిప్రత్యామ్నాయ విధానం ప్రవేశపెట్టడం పట్ల కూడా కొందరు ఉద్యోగులు నిరసన తెలిపారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలని కోరారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగు ఉద్యోగులను రెగ్యులర్ చేయడం విషయంలో పెట్టిన నిబంధనలను వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. విశాఖస్టీల్‌ప్లాంటును ప్రయివేటు మల్టీనేషనల్ కంపెనీలకు అమ్మే నిర్ణయాన్ని ఉపసంహరించని నేపథ్యంతో అమిత్‌షా విశాఖ పట్టణం బహిరంగ సభకు రావద్దని 'గోబ్యాక్ అమిత్‌షా' అంటూ జిల్లా కేంద్రాలలో నిరసన తెలిపారు.రెజ్లర్లను లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపిపై చర్యలు తీసుకోవాలని క్రీడాకారులు, ప్రజాసంఘాల నిరసనలు కొనసాగాయి. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. నన్నూరు హైవేలో పుట్‌వే(బిడ్జినిర్మాణం ఆపాలని ప్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని విద్యార్థులు, స్థానిక ప్రజలు, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్ష చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఒక పక్క ప్రభుత్వం ప్రకటిస్తుంది. అన్ని విత్తనాలు అందుబాటులో లేవని రైతులు ఆర్‌బికె కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఉంది. ప్రధానంగా మిరప, ఇతర వాణిజ్య పంటల విత్తనాలు రైతులకు అందు బాటులో లేవంటున్నారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని చెప్పినా ఇంకా మార్కెట్‌లో ఉన్నాయని అక్కడక్కడ నిరసన తెలిపారు. ఎండతీవ్రత తగ్గక పోవడంతో పాఠశాలలు తెరిచినప్పటికీ ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. జగనన్న కిట్ల పేరుతో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాకులు ఇతర వస్తువులను అధికారులు అందజేస్తున్నారు. ఇంటర్ సప్లిమెంటరీ, నీట్, ఇంజనీరింగ్ తదితర ఫలితాలు వెలువడ్డాయి. జిల్లా కలెక్టర్ కర్నూలు ఇండోర్ స్టేడియంను సందర్శించారు. అక్కడ నిర్వహిస్తున్న వివిధ క్రీడా ప్రాంగణాలను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అదేశించారు. సన్‌సదర్ ఆదర్శ గ్రామయోజనపథకం పై సడన్‌గా సమీక్ష నిర్వహించారు. కర్నూలు పార్లమెంటు పరిధిలోని ఐదు గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఎంపీ , రాష్ట్ర ప్రభుత్వం దత్తతతీసుకుంది. గ్రామాల్లో మందకొడిగా పనులు జరుగుతున్నాయని కర్నూలు కలెక్టర్ డాక్టర్ జి.సృజన అసంతృప్తి వ్యక్తం చేశారు. కోడిమాంసం ధర రోజురోజుకు పెంచుతున్నారు.రూ. 240 నుంచి రూ.300 పెరిగింది. దీంతో మాంసం ప్రయులు కొనడానికి వెనుకాడుతున్నారు. వినియోగం తగ్గిందని దుకాణ యజమానులు అంటున్నారు. కౌతాళం మండలం కర్ణాటక సరిహద్దు గ్రామంలో భార్యను, అత్తను కట్టుకున్నోడే పెళ్లయిన నెలలోపే హత్య చేయడం చర్చనీయాంశమైంది. క్రిష్ణగిరి మండలం కంబాలపాడు గ్రామంలో గురుకుల పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య విద్యార్థి లోకాన్ని ఆందోళనకు గురి చేసింది.



అమ్మాయిలను చదివించాలి

- విద్యారంగానికి పెద్ద పీట

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

విద్యారంగానికి రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆకాంక్షించారు. అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయకుండా ఒకస్థాయికి వచ్చే వరకు చదివించాలని జిల్లా కలెక్టర్ తల్లిదండ్రులను కోరారు. శనివారం సునయన ఆడిటోరియంలో జగనన్న ఆణిముత్యాలు అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, కర్నూలు ఎంపీ డాక్టరు సంజీవ్ కుమార్, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ,జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు నగర మేయర్ బివై.రామయ్య, కర్నూలు నగర కమిషనర్ భార్గవ తేజ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచి మంచి మార్కులతో ఉన్నత చదువులకు వెళ్తున్న విద్యార్థులను సన్మానించి వారి కష్టాన్ని, కషిని కింది తరగతి విద్యార్థులకు తెలియజేస్తే వారు కూడా మోటివేట్ అవుతారన్నారు. వారికి ప్రోత్సాహకంగా ఉంటుందని జగనన్న ఆణిముత్యాలు ద్వారా కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం కింద జిల్లాలో మొదటి మూడు స్థానాలు పొందిన 26 మంది పదవ తరగతి విద్యార్థులకు, 18 మంది ఇంటర్ విద్యార్థులకు పురస్కారాలు ఇచ్చామన్నారు. నిరుపేద పిల్లలు కూడా ఉన్నత విద్య అభ్యసించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యారంగంలో అనేక మార్పులు తీసుకు వచ్చిందన్నారు. జిల్లాలో నిరక్షరాస్యత పారద్రోలాలని సూచించారు. కర్నూలు ఎంపీ మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యాన్ని ప్రోత్సహిస్తుందని, సమాజంలో చెడును పారదోలి అభివృద్ధిని సాధించాలంటే అది విద్య వల్లనే సాధ్యమని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ విద్యా రంగానికి పెద్ద పీట వేస్తూ విద్యార్థుల కోసం అనేక రకాల కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు. నగర మేయర్ మాట్లాడుతూ ఎక్కడైతే ఎక్కువగా విద్యను అభ్యసించిన వారు ఉంటారో ఆ ప్రాంతం ఆ రాష్ట్రం అభివద్ధి చెందుతుందన్నారు. పదవ తరగతికి సంబంధించి జిల్లా స్థాయిలో 26 మంది విద్యార్థులకు, ఇంటర్‌కు సంబంధించి 18 మంది విద్యార్థులకు నగదు పురస్కారంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్, మెమెంటోతో సత్కరించారు. ఇంటర్‌లో గ్రూపుల వారిగా ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు పురస్కారంతో పాటు మెరిట్ సర్టిఫికెట్, మెడల్, మెమెంటో అందించారు. విద్యార్థులకు మొత్తంరూ రూ.16 లక్షల 78 వేల నగదు పురస్కారానికి సంబంధించిన మెగా చెక్ అందించారు. డిఇఒ రంగారెడ్డి, సర్వ శిక్ష అభియాన్ పిఒ వేణుగోపాల్ వివిధ పాఠశాలల హెడ్మాస్టర్లు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పథకాలు అమలుకు జగనన్న సురక్ష : అర్హులందరికీ పథకాలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23న జగనన్న సురక్ష కా ర్య క్ర మా న్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. విజయవాడ నుంచి జగనన్న సురక్ష కార్యక్రమంపై అన్ని జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి కార్యాలయ అదనపు కార్యదర్శి భరత్ గుప్తాతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని గ్రా మా లు , మునిసిపాలిటీల్లో అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందని వారికి, క్యాస్ట్ సర్టిఫికెట్, రెసిడెన్స్ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్, జనన మరణ ధ్రువీకరణ పత్రం, మ్యారేజ్ సర్టిఫికెట్ లాంటి అవసరమైన పత్రాలను తక్షణమే అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. అన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా షెడ్యూలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో ఎంపిడిఒ, డిప్యూటీ తహశీల్దారు ఒక టీముగా, తహశీల్దారు, ఇఒఆర్‌డి రెండో టీముగా ఏర్పడి గ్రామాలను సందర్శించాల న్నారు. జూలై 1వ తేదీ నుంచి నాలుగు వారాల్లో అన్ని సచివాలయ పరిధిల్లో ఉన్న ప్రతి కుటుంబాన్ని సందర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలతో సానుకూలంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. ప్రజా సమ స్యలను సంతృప్తి స్థాయిలో పరిష్కరించేందుకు, అర్హులెవరు మిగిలిపోకుండా పథకాలను అందరికి అందించడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.



విద్యార్థులకు అవార్డులను అందజేస్తున్న కలెక్టర్, ఎంపీ, మేయర్, జడ్‌పి చైర్మన్



శ్రీలక్ష్మీ స్కూలు వ్యవహారంపై నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నగర నాయకులు

శ్రీ లక్ష్మీ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

అక్రమంగా అధిక ఫీజులతో స్తకాలు అమ్ముతున్న శ్రీలక్ష్మిస్కూలు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నగర నాయకులు డిఇఒను కోరారు. కర్నూలు నగరంలోని శ్రీలక్ష్మీ పాఠశాలను ఎస్ఎఫ్ఐ నగర కమిటీ శనివారం పరిశీలించింది. కర్నూలు సిటీ అధ్యక్ష కార్యదర్శులు అమర్‌బాబు , సాయి ఉదయ్ , సిటీ ఉపాధ్యక్షులు నరసింహ సిటీ సహాయ కార్యదర్శి అబుబాకర్ సిటీ కమిటీ సభ్యులు వీరేష్, యోగి, కిరణ్ ఉన్నారు. అక్రమంగా అధిక ఫీజులతో శ్రీలక్ష్మి పాఠశాల యజమాన్యం పుస్తకాలు అమ్ముతున్నారన్నారు. స్కూలు బోర్డు మీద సిబిఎస్ఇ అనే పేరు లేకుండా తరగతులు నిర్వహిస్తుండడంతో ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను విరుద్ధంగా పుస్తకాలు అమ్మడం ఏంటని ప్రశ్నించిన ఎస్ఎఫ్ఐ నాయకులపైన పాఠశాల సిబ్బంది దురుసుగా మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు సిటీ కమిటీ బృందంపై కరస్పాండెంట్ విపరీతంగా దురుసుగా మాట్లాడటంతో నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా పుస్తకాలు అమ్ముతున్న శ్రీలక్ష్మి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే పాఠశాల గుర్తింపు రద్దు చేయాలన్నారు. ఇప్పటికైనా డిఇఒ స్పందించి సమస్యలు పరిష్కరించకపోతో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : పంచలింగాల సెబ్ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తూ మృతి చెందిన కానిస్టేబుల్ ఎస్.అన్సర్‌బాషా కుటుంబానికి 2011 బ్యాచుకు చెందిన తోటి కానిస్టేబుళ్ల ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమని ఎస్‌పి జి.కృష్ణ కాంత్ అన్నారు. తమ తోటి కానిస్టేబుల్ కుటుంబానికి అండగా నిలిచేందుకు తమ వంతు సహాయంగా సేకరించిన మొత్తం రూ. 2 లక్షల 87 వేల నగదును శనివారం జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ చేతుల మీదుగా షేక్ అన్సర్‌బాషా భార్య షేక్ సనఅఫ్రీన్‌కు అందజేశారు. 2011 బ్యాచ్ పోలీసులు, షేక్‌అన్సర్ బాషా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్‌పి

బీడీ వర్కర్స్ కాలనీలో రోడ్డు, కాలువలు నిర్మించాలి

ఆవాజ్ కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని జొహరాపురం సమీపంలోని బీడీ వర్కర్స్ కాలనీలో రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆవాజ్ నగర అధ్యక్షులు పి. ఇక్బాల్ హుస్సేన్, కార్యదర్శి షేక్ మొహమ్మద్ షరీఫ్ నగర కమిషనర్‌ను కోరారు. శనివారం నగర పాలక సంస్థ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 15 సంవత్సరాల నుండి అక్కడే నివాసం ఉంటున్నప్పటికీ అక్కడి ప్రజలకు ఎటువంటి మౌలిక వసతులు కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ సచివాలయం ఉన్నప్పటికీ వాలంటీరు ఎవరో కూడా తెలియని దుస్థితి అక్కడి ప్రజానీకానికి ఉందని చెప్పారు. నెలనెలా బియ్యం వెయ్యడానికి వచ్చే సచివాలయ సిబ్బంది ప్రజల పట్ల ఏమాత్రం గౌరవంగా వ్యవహరించడం లేదని, మహిళలు, వృద్ధులని కూడా చూడకుండా, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని అక్కడి ప్రజలు వాపోయారన్నారు. అక్కడి ప్రజలు నడవడానికి చాలా ఇబ్బందికరమైన పరిస్థితులు ఉండి అవస్థలు పడుతున్నారని, కంపలు, పొదలు ఉన్నాయన్నారు. పాములు, తేలు సంచరిస్తున్నాయని తక్షణమే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. కనీస అవసరాలు అయిన మంచినీరు, రోడ్లు, కాలువలు వీధి దీపాలు కూడా వెలిగించ లేని దీనస్థితిలో నగరపాలక సంస్థ ఉందంటే చాలా విచారకరమని అన్నారు. తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ ఈ కాలనీలో పర్యటించాలని ,స్థానిక సమస్యలను పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. లేని పక్షంలో ప్రజానీకాన్ని సమీకరించి మున్సిపల్ ఆఫీస్ ముందు పెద్దఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్వర్‌బాష ,అబ్దుల్ దేశాయి, అల్లాబకాష్, ప్రకాష్, రియాజ్ ,షైజాద్, శివ, అబ్దుల్ రసూల్ ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆవాజ్ నాయకులు



జిజిహెచ్‌లోని స్టోర్‌ను పరిశీలిస్తున్న సూపరిన్‌టెన్‌డెంట్

జిజిహెచ్‌లో పలు విభాగాల తనిఖీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలోని డైట్, పెయిన్ బ్లాక్, ఆరోగ్యశ్రీ విభాగాలను ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ జి నరేంద్ర నాథ్ రెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రిలోని పేషెంట్స్ కు అందుతున్న భోజన వసతుల గురించి ఆరా తీశారు. అక్కడున్న ప్రతి ఆహార వస్తువులను రేషన్ వస్తువులను పరిశీలించారు. ఆస్పత్రిలోని డైట్ విభాగాన్ని ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పేషెంట్లకు మెరుగైన రుచికరమైన భోజన వసతులను అందించాలని డైట్ సిబ్బందిని ఆదేశించారు. పెయిన్ బ్లాక్ తనిఖీ చేసి అక్కడ ఉన్న సిబ్బందిని ఆరా తీశారు. పెయిన్ బ్లాక్ విభాగంను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడున్న సిబ్బందికి సూచించారు. శానిటేషన్ సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రి , ఆస్పత్రి విభాగాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉండేటట్లు పర్యవేక్షణ చేయాలని హాస్పిటల్ హెల్త్ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిఎస్ఆర్ ఎంఆర్ డాక్టర్ వెంకటేశ్వరరావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు గోవిందు, కృష్ణమూర్తి, నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ సిటీగా తీర్చిదిద్దడమే ధ్యేయం

పారిశుధ్య పనులను ఆకస్మిక తనిఖీ చేసిన కమిషనర్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరాన్ని మెరుగైన పారిశుధ్యంతో క్లీన్ సిటీగా తీర్చిదిద్దటమే తమ లక్ష్యమని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. శనివారం నగరంలో తెలుగు వీధి, గాంధీ నగర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆరోగ్యధికారి విశ్వేశ్వర్ రెడ్డితో కలిసి కమిషనర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పారిశుధ్య పనులపై స్థానికులతో చర్చించారు. అలాగే కెసి. కాలువను శుభ్రపరుస్తున్న తీరును పరిశీలించారు.

30 లీటర్ల నాటుసార స్వాధీనం

ప్రజాశక్తి-వెల్దుర్తి

కోడుమూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలోని వెల్దుర్తి మండల సెబ్ ఎస్ఐ కోడుమూరు వారి సిబ్బంది , వెల్దుర్తి సివిల్ ఎస్ఐ సిబ్బంది శనివారం సంయుక్తంగా నిర్వహించిన దాడులలో గోవర్ధనగిరి, బాలాపురం గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ఈదాడులలో గోవర్ధనగిరికి చెందిన ఇద్దరు వ్యక్తులు చిన్న మునిస్వామిని, బోయ నాగమద్దయ్యను అరెస్టు చేసి 30 లీటర్ల నాటు సారాయిని స్వాదీనము చేసుకొని ఇద్దరి పై కేసులను నమోదు చేశారు. అరెస్టు చేసిన ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం డోన్ ఎక్సైజ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు.





సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న డిఎంహెచ్ఒ డాక్టర్ రామగిడ్డయ్య

సిహెచ్‌ఒల శిక్షణ ముగింపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య సర్టిఫికేట్లను ప్రదానం చేసారు. ఆయన మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణ కార్యక్రమంలొ నేర్చుకొన్న అంశాలపై ఆయా ప్రాంతాలలో ప్రజలకు సేవలు అందించాలని అన్నారు. తేలుకాటు, పాముకాటు, కుక్క కాటుకు ప్రథమ చికిత్సలు చేయు విధానం, రోడ్డు ప్రమాదాల కేసులకు ప్రథమ చికిత్సలు చేసి రెఫెర్ చేయడం, గాయాలకు కట్టు కట్టుట, కుట్లు వేయు విధానం నేర్పించారు. వివిధ రకాలుగా ఇంజక్షన్ చేయు పద్ధతి, అత్యవసర పరిస్థితులలో సిపిఆర్ (కార్డియో పల్మనరీ రేససిటీసన్) చేయు విధానం గురించి వివరించారు. మీ హెల్త్ ,వెల్ నెస్ సెంటర్స్ పరిదిలోని ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందిన కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ శిక్షణలో తాము నేర్చుకొన్న అంశాలపై ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అంది స్తామని అన్నారు. వైస్ ప్రిన్సిపల్ రుక్మిణి, డిపిఒ విజయరాజు, నోడల్ ఆఫీ సర్లు ఐజాల్ హక్ సుబ్రమణ్యం, హాలహర్వి, హాలహర్వి ఎన్ గూడూరు, హరగిరి గోనెగండ్ల పి హెచ్ సి ల నుండి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పి) లు పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-గూడూరు : గూడూరు మండలం జూలకల్లు గ్రామానికి చెందిన రైతు ఉప్పరి రామాంజనేయులు(45) అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య చేసుకున్నారు. రైతు వ్యవసాగులో పంటల దిగుబడి సరిగా రాక చేసిన అప్పులు తీర్చుకోలేక మనస్థాపానికి గురయ్యారు. శనివారం ఉదయం 10 గంటల సమయంలో గ్రామ శివారులలోని పొలంలో ఒంటరిగా వెళ్లి మునగాల జూలకల్లు గ్రామాల మధ్య నీళ్లలో రసాయనిక మందు కలుపుకొని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం అటువైపుగా వెళ్తున్న గ్రామ పాదాచారులు చూసి వారి బంధువులకు సమాచారం అందించారు. గ్రామ సర్పంచి విద్యావతమ్మ కుమారుడు దామోదర్ రెడ్డి విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి పరిశీలించి పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గూడూరు పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

- జగనన్న కాలనీలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం


అధికారులతో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. శనివారం తహాశీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్, రోడ్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల ఇన్‌ఛార్జీ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు విశ్వనాథ్ రెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు. హౌసింగ్ పీడీ వెంకటరమణ, తహాశీల్దార్ చంద్ర శేఖర్, ఎంపిడిఒ మణిమంజరి, హౌసింగ్ డిఇ లాలీ కృష్ణయ్య పాల్గొన్నారు.

పురాతన వాటర్ ట్యాంకు కూల్చివేత

ప్రజాశక్తి - చిప్పగిరి


వాటర్ ట్యాంకును కూల్చివేస్తున్న అధికారులు

మండలంలోని రామదుర్గం గ్రామంలో పురాతన కాలం నాటి వాటర్ ట్యాంకును కూల్చివేశారు. కూలడానికి సిద్ధంగా ఉన్న వాటర్ ట్యాంకును సర్పంచి రోహిణి, గ్రామ పెద్దలు చెప్పిన విధంగా ఎవరికీ అపాయం జరగకూడదని శనివారం తహాశీల్దార్ లక్ష్మీనారాయణ, ఇఒఆర్‌డి సంజన, ఆర్‌డబ్ల్యుసి ఎఇ రామ్ నీల, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో జెసిబి ద్వారా కూల్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ట్యాంకు సమీపంలో నివాసం ఉన్న కుటుంబాలకు ఏమాత్రం అపాయం కలుగకుండా, విద్యుత్ తీగలను తొలగించి కూల్చివేత కార్యక్రమం చేపట్టామని తెలిపారు. వాటర్ ట్యాంకు కూలడానికి సిద్ధంగా ఉందని, ఎప్పుడైనా, ఎవరికైనా అపాయం జరగవచ్చని పలుమార్లు జరిగిన గ్రామసభల్లో గ్రామ పెద్దలు అధికారుల దృష్టికి తెచ్చారని అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కూల్చివేత చేపట్టామని తెలిపారు. వైసిపి నాయకులు ఈరప్ప, పోలీసు ఖాదర్ వలీ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో నాణ్యమైన విద్య

- ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి


కార్యక్రమంలో పాల్గొన్న గుమ్మనూరు నారాయణ

జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన విద్యనందిస్తోందని ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ తెలిపారు. శనివారం మండలంలోని గుమ్మనూరు అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ లలిత, సూపర్‌వైజర్ ప్రసూన ఆధ్వర్యంలో ప్రభుత్వం సరఫరా చేసిన ఆట వస్తువుల కిట్ల పంపిణీ చేపట్టారు. ముఖ్యఅతిథిగా గుమ్మనూరు నారాయణ హాజరయి మాట్లాడారు. ముఖ్యంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు నాణ్యమైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రయివేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా చిన్నారులను ఆకర్షించేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో ఆట వస్తువులను సమకూరుస్తున్నారని చెప్పారు. పంచాయితీ కార్యదర్శి సురేంద్ర, వైసిపి నాయకులు శ్రీధర్, గుమ్మనూరు చంద్రయ్య, తిరుమలేష్, నారి పాల్గొన్నారు.

పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలు

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పెద్దకడుబూరు : పెద్దకడుబూరులో వీధి దీపాలు పట్టపగలు వెలుగుతున్నాయి. వీధి దీపాలు పగలంతా వెలుగుతుండడంతో సంబంధిత అధికారులకు ఎంత బాధ్యత ఉందో స్పష్టంగా అర్థమవుతోందని విమర్శిస్తున్నారు. ఓ వైపు సామాన్యుల ఇంట్లో ఒక్క బలుపు వెలిగించుకోవాలంటే ఎన్నో నిబంధనలు పెట్టే అధికారులు రోడ్ల వెంట వీధి దీపాలు వెలుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇలా ఏకధాటిగా వెలగడం ద్వారా విద్యుత్ వృథా అయి ప్రభుత్వానికి నష్టమెలా జరుగుతుందని పలువురు ప్రశ్నించారు. ఇలా రోజుల తరబడి బల్బులు వెలుగుతున్నా సర్పంచి కానీ, పంచాయతీ కార్యదర్శి కానీ చూసీచూడనట్లు వ్యవహరించడం బాధ్యతరాహిత్యంపై ప్రజలు చర్చించుకుంటున్నారు.


వెలుగుతున్న వీధి దీపాలు

రోడ్డు నిర్మాణాలు

పూర్తయ్యేదెన్నడో..?

- మూడేళ్లుగా భూమి పూజకే పరిమితం

- ముందుకు సాగని రోడ్డు నిర్మాణాలు

ప్రజాశక్తి - దేవనకొండ

చాలా ఏళ్లుగా అధ్వానస్థితిలో ఉన్న రహదారుల నిర్మాణాలకు అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. మూడేళ్ల క్రితం దేవనకొండ మండలం కొత్తపేట, కరిడికొండ, వరిముక్కల, వెలమకూరు గ్రామాల మట్టి రహదారుల నిర్మాణాలకు రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరామ్ భూమిపూజ చేశారు. రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమై తమ ఇబ్బందులు తొలగిపోతాయన్న ఆయా గ్రామాల ప్రజల ఆశ నిరాశగానే మిగిలింది. ఈ రహదారుల నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను ప్రారంభించలేదు. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేదెన్నడో అని ఆయా గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు.

మండలంలోని కొత్తపేట, కరిడికొండ, వరిముక్కల, వెలమకూరు గ్రామాల రహదారులు అధ్వానస్థితిలో ఉన్నాయి. మట్టి రహదారులపై గుంతలు ఏర్పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం ప్రారంభంలో గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో అనేక అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. నిత్యం వివిధ పనుల నిమిత్తం దేవనకొండకు రావాలన్నా, వ్యవసాయ పంట ఉత్పత్తులు కర్నూలు, పత్తికొండ, ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్లకు తరలించేందుకు అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. గర్భిణులు, బాలింతలు, అత్యవసర రోగులు వైద్యం కోసం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిలిచిపోయిన ఆయా గ్రామాల రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


అధ్వానంగా ఉన్న కొత్తపేట రహదారి

ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

- ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

వికలాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కోరారు. శనివారం ఎమ్మెల్యే స్వగ్రామమైన రాంపురంలో వికలాంగులకు ట్రై మోటార్ సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో వికలాంగులకే కాకుండా అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వికలాంగులు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని కొనియాడారు. మొదటి విడత కింద 5, రెండో విడత కింద 5 మొత్తం 10 ట్రై మోటార్ సైకిళ్ల పంపిణీ చేశారు. రాష్ట్ర వికలాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ ఛైర్మన్ ముంతాజ్ పఠాన్, వైసిపి మండల అధ్యక్షులు జి.భీమిరెడ్డి, వైసిపి పెద్దకడుబూరు మండల అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎమ్మెల్యే పిఎ వెంకట్రామి రెడ్డి, రవి చంద్ర రెడ్డి పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను, నాయకులను సన్మానిస్తున్న వికలాంగులు


ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి

'సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి '

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వమైన వైసిపిని ఆదరించాలని వైసిపి నియోజకవర్గ సీనియర్ నాయకులు ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని 30వ వార్డు సచివాలయంలో రెండోరోజూ 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ముందుగా ఆంజనేయ స్వామి గుడిలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను, వాటి ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. వార్డు పరిధిలోని కొన్ని వీధుల్లో తాగునీటి సరఫరా సమస్య, సిసి రోడ్లు తదితర సౌకర్యాలు కావాలని ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అన్ని వార్డుల్లో ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

- బాధిత రైతుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన సుంకేశ్వరి, ముక్కరన్నకు చెందిన గడ్డి వాములు దగ్ధమయ్యాయి. రైతుకు నష్టం వాటిల్లడంతో వైసిపి రాష్ట్ర యువనేత వై.ప్రదీప్ రెడ్డి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. గత వారం రోజుల క్రితం ఈదురు గాలులకు విద్యుత్ తీగలు తెగి పడి మంటలు చెలరేగి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు యువనేత చేయూతనందించారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో గ్రామ నాయకులతో కలిసి నగదు అందజేశారు. మాజీ వైస్ ఎంపిపి వెంకోబా, నాయకులు రోగప్ప, రవి రెడ్డి, బొజ్జప్ప, నారాయణ, డీలర్ బొజ్జప్ప, వీరన్న గౌడ్, నరసప్ప పాల్గొన్నారు.


ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రదీప్‌రెడ్డి

అక్రమ కట్టడాలు తొలగింపునకు

నాంది పలికిన కన్యాకుమారి

- చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో రాజకీయ నాయకుల ఒత్తిళ్లను తట్టుకొని అక్రమ కట్టడాలకు కూల్చివేతకు అప్పటి మున్సిపల్ కమిషనర్ కన్యాకుమారి నడుం బిగించారు. ఆమె చేపట్టిన ఈ చర్యలను ఆదోని ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేదు. అప్పట్లో రోజురోజుకు పెరుగుతున్న అక్రమ కట్టడాలు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకొని నిర్మించుకున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తూ ముందుకు సాగి అనేక అక్రమ కట్టడాలను కూల్చి వేశారు. 11 ఏళ్ల క్రితం సేవలందించిన పూర్వపు కమిషనర్ కన్యాకుమారి ఇక లేరన్న వార్త తెలిసి ఆదోని ప్రజలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఉన్న పూర్వపు కమిషనర్ కన్యాకుమారి శనివారం హైదరాబాద్‌లో మృతి చెందారు. ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ బోయ శాంత ఆధ్వర్యంలో సంతాపసభ నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఛైర్మన్ బోయ శాంత, కమిషనర్ రఘునాథ్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. కన్యాకుమారి ఆదోని మున్సిపల్ కమిషనర్‌గా రెండు పర్యాయాలు విధులు నిర్వహించారు. 2012లో ఆదోనిలో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన కన్యాకుమారి 2013లో పట్టణంలోని అక్రమ కట్టడాల తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. పట్టణంలోని శ్రీనివాస భవన్ యాజమాన్యం పక్కనే ఉన్న ఇద్రూస్ బావిని ఆక్రమించుకుని నిర్మించుకున్న అక్రమ కట్టడాలను తొలగించి అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టించారు. ఆమె సేవలతో ఆదోనిలో రికార్డు సృష్టించారు. ఎమ్మిగనూరు టర్నింగ్‌లోనూ, చందా సాహెబ్ దర్గా ప్రాంతంలోనూ అనేక ప్రాంతాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలను గుర్తించి తొలగించి కూల్చివేతలు చేపట్టారు. అలాగే పట్టణంలోని అనేక మున్సిపాలిటీ స్థలాలను గుర్తించి అందులో నిర్మించిన అక్రమ కట్టడాలను కూడా తొలగించి మున్సిపాలిటీకి స్వాధీనం చేసే విధంగా చర్యలు చేపట్టారు. 2014లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో నామినేషన్ల పరిశీలనను సుదీర్ఘంగా 20 గంటల పాటు చేపట్టి అనర్హులు పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వకుండా, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించారు. ఆమె ధైర్యాన్ని పలువురు ప్రశంసించారు. అప్పట్లో కన్యాకుమారి చేసిన సేవలను గుర్తించుకొని ఎమ్మెల్యే వై.సాయి ప్రసాద్ రెడ్డి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదోని కమిషనర్‌గా కన్యాకుమారిని నియమించి అక్రమ కట్టడాలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆదోనిలో 2020లో చేరిన కమిషనర్ కన్యాకుమారి ఆరోగ్యం సహకరించకపోవడంతో ఆరు నెలల్లోనే ఇక్కడి నుంచి బదిలీ చేసుకుని వెళ్లిపోయారు. అప్పటి నుంచి అనారోగ్యంతో ఉన్న ఆమె చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందారు.


నివాళులర్పిస్తున్న ఛైర్మన్, కమిషనర్


కన్యాకుమారి (ఫైల్)

కుప్పగల్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్ బీట్ అధికారి సస్పెన్షన్

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఉన్న కుప్పగల్ బీట్ అధికారి సి.శమీవుల్లాను విధుల నుంచి సస్పెన్షన్ చేసినట్లు రేంజర్ రామచంద్రుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. గత కొద్దిరోజుల క్రితం రిజర్వ్‌డ్ ఫారెస్టులో కొందరు ఎలాంటి అనుమతులూ లేకుండా పైపులైన్లు వేయడంలో సహకరించడం, కంబాలదిన్నె గ్రామంలో చనిపోయిన ముసలి వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వంటి పలు ఆరోపణలు జిల్లా అటవీ అధికారి దృష్టికి వెళ్లాయన్నారు. వారం రోజుల క్రితం విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని సదరు రేంజ్ అధికారిని ఆదేశించారన్నారు. రేంజ్ అధికారి అందించిన నివేదిక మేరకు విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన శమీవుల్లాను విధుల నుంచి సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. కుప్పగల్ బీట్‌కు ఇన్‌ఛార్జ్ బీట్ అధికారిగా ప్రస్తుతం ఇస్వి బీట్‌లో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లును నియమించినట్లు చెప్పారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

మండలంలోని కల్లుకుంట గ్రామంలో స్నేహితుని కుటుంబానికి పలువురు స్నేహితులు ఆర్థిక సహాయం అందజేశారు. కల్లుకుంట గ్రామంలో గత పది రోజుల క్రితం ఉప్పర హుస్సేని అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మృతుని కుటుంబానికి స్నేహితులు ఆర్థిక సహాయం చేశారు. ముఖ్యఅతిథిగా మాజీ సర్పంచి ఈడిగ సత్యనారాయణ గౌడ్, ఎంపిటిసి ఇర్ఫాన్ పటేల్, వైసిపి నాయకులు, డీలర్ నర్సింగప్ప, డీలర్ ఉచ్చప్ప, విజయ్ కుమార్, కటిక మహ్మద్, జల్లమ్మ గారి తిక్కన్న, బోయ ఈరన్న, ఉప్పర రాము మృతుని కుటుంబానికి తోడుగా ఉంటామని తెలిపారు. రూ.10 వేలను మాజీ సర్పంచి సత్యనారాయణ గౌడ్ చేతులమీదుగా హుస్సేని తల్లికి అందజేశారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

- డివిజన్ కన్వీనర్ కీర

ప్రజాశక్తి - ఆదోని

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో విజయవాడలో జరిగే సదస్సును జయప్రదం చేయాలని డివిజన్ కన్వీనర్ కీర కోరారు. శనివారం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో దశాబ్ద కాలంగా తక్కువ వేతనానికి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన విధులు నిర్వర్తించినా రెగ్యులర్ చేయకుండా నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 20 ఏళ్ల నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన పని చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రెగ్యులర్ చేసేంత వరకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. నాయకులు తిప్పన్న, గోపాల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. అన్నదాన సత్రంలో హెడ్ కుక్‌గా పనిచేస్తున్న చంద్ర స్వామి మృతితి చెందినట్లు దేవాలయం సిబ్బంది తెలిపారు. ఈయన మృతి పట్ల దేవాలయ సహాయ కమిషనర్ వాణి, దేవాలయ కమిటీ ఛైర్మన్ నాగరాజ్ గౌడ్, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

మారెమ్మ గుడిలో హుండీ పగులగొట్టి చోరీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో వెలసిన శ్రీమారెమ్మ దేవాలయంలో శనివారం తెల్లవారుజామున దుండగులు హుండీ పగుల గొట్టి చోరీకి పాల్పడ్డారు. దేవాలయంలో ఉన్న సిసి కెమెరాలు ధ్వంసం చేసి దానికి సంబంధించిన హార్డ్ డిస్క్ బాక్స్‌ను కూడా దొంగలించినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామ స్తుల వివరాల మేరకు... ఎప్పుడూ రాత్రి పూట మైకు పెట్టడం లేదని, శనివారం రాత్రి 2 గంటల సమయంలో మైకు పెట్టి, సిసి కెమెరాలను, హుండీలను ధ్వంసం చేసి నగదును దొంగలించినట్లు తెలిపారు. గ్రామీణ పోలీసులు తిమ్మాపురం గ్రామానికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని బాపురం వద్ద ఉన్న ఎల్ఎల్‌సి కాలువ దగ్గర అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డి.నరసింహా, భాగ్యలక్ష్మి, తిరుమలను అరెస్టు చేశారు. వారి నుంచి 940 ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ కంపెనీ టెట్రా ప్యాకెట్లను, రెండు మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేశారు. సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ విజయ్ కుమార్, కానిస్టేబుల్ గోవర్ధన్, నాయక్ పాల్గొన్నారు.

కెజిబివి ప్రిన్సిపల్‌గా పుష్పలత

ప్రజాశక్తి - కౌతాళం

స్థానిక కస్తూరిబాయి గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్‌గా పుష్పలత బాధ్యతలు చేపట్టారు. శనివారం ఆమె మాట్లాడారు. కోసిగి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. పాఠశాలల్లో బాలికలకు ప్రభుత్వపరమైన అన్ని వసతులూ కల్పించి, నాణ్యమైన విద్యనందించడానికి కృషి చేస్తానన్నారు. అందరి సహకారంతో మంచి సేవలు అందిస్తామన్నారు.

వైసిపితోనే విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రభుత్వ విద్యలో విప్లవాత్మక మార్పులు వైసిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని శ్రీనీలకంఠేశ్వర స్వామి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారని తెలిపారు. పిల్లలు బాగా చదవాలంటే వారికి పౌష్టికాహారం కూడా అవసరమని మధ్యాహ్న భోజనం మెనూ కూడా మార్చారని చెప్పారు. ప్రతి పేద విద్యార్థికీ అండగా ఉంటూ బూట్లు, పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా ఇస్తున్నారని తెలిపారు. ఎంఇఒ ఆంజనేయులు పాల్గొన్నారు. **నందవరం** మండలంలోని టి.సోమలగూడూరు ఎంపియుపి పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి గోవిందు, వైసిపి మండల నాయకులు వెంకటేశ్వర రెడ్డి మాట్లాడారు. మండలంలో విద్యాభివృద్ధికి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి, సీనియర్ నాయకులు జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎంపిపి స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి

వైసిపి అరాచక పాలనను అంతం చేద్దాం : టిడిపి

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనను అంతం చేద్దామని టిడిపి రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి నారాయణ, వాల్మీకి సాధికారత కమిటీ జిల్లా కన్వీనర్ భాస్కర్ నాయుడు కోరారు. శనివారం వారు టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాప్రతినిధుల కుటుంబానికే రక్షణ లేకుంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే దోపిడీలు, దొంగతనాలు, దౌర్జన్యాలు, దాడులు పెరిగి ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని తెలిపారు. 5 కోట్ల మంది ప్రజలకు భవిష్యత్తుపై గ్యారంటీ ఇస్తూ చంద్రబాబు నాయుడు ప్రకటించిన ఆరు పథకాలు భరోసా కల్పిస్తాయని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. టిడిపి జిల్లా నాయకులు నాగరాజు, పట్టణ అధ్యక్షులు చంద్రశేఖర్, గూళ్యం రామాంజినేయులు, హనుమప్ప, బి.శివ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నారాయణ

మట్టి నమూనా సేకరణను వినియోగించుకోండి

ప్రజాశక్తి - నందవరం

మట్టి నమూనాల సేకరణను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ తెలిపారు. శనివారం మట్టి నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మట్టినమూనా పరీక్ష కోసం కెవికె బనవాసి కేంద్రానికి వెళ్లి చేయించుకునే వారని తెలిపారు. ఇప్పుడు ప్రభుత్వం ఆర్‌బికె స్థాయిలోనే రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఒక్కో ఆర్‌బికెకు 22 మంది రైతుల మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యాన్ని నిర్దేశించిందన్నారు. మట్టి నమూనా సేకరణ పరిశీలించి సిబ్బందికి తగు సలహాలు, సూచనలు ఇచ్చామన్నారు. క్యూఆర్ కోడ్ ఆధారం చేసుకుని మట్టినమూనాలు తీసేందుకు సిబ్బందికి శిక్షణ ఇది వరకే ఇచ్చామని, రైతులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎఒ స్రవంతి, ఎఇఒ సురేంద్ర గౌడ్, ఆర్‌బికె సిబ్బంది వెంకటేష్, త్రివేణి, రామలక్ష్మి, జ్యోతి, రైతులు పాల్గొన్నారు.


మట్టి నమూనాను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి

- ఎస్ఐకి విద్యార్థి సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులకు, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా పాఠశాలను ఎత్తేసిన పట్టణంలోని గీతా మందిర్ దగ్గరలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, విద్యార్థులకు టిసిలు ఇప్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు రాజేష్, శేఖర్, ఉదయ్, సురేష్, ఆఫ్రిద్, రఘు డిమాండ్ చేశారు. శనివారం పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ మస్తాన్ వలీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భగా వారు మాట్లాడారు. పట్టణంలో ఉన్న రవీంద్ర భారతి పాఠశాలకు సరైన అనుమతులు లేకున్నా విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసి దాదాపు 250 మంది విద్యార్థులను చేర్చుకున్నారని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో అన్నీ పాఠశాలలు తెరచి తరగతులు నిర్వహిస్తున్నారని, రవీంద్ర భారతి పాఠశాల మాత్రం తెరవకుండా మూసివేశారని చెప్పారు. తల్లిదండ్రులు రోజూ పాఠశాల చుట్టూ తిరుగుతున్నారని, ఎవరూ స్పందించడం లేదని తెలిపారు. ఇక్కడ పని చేసిన స్టాఫ్‌ను అడగ్గా సమాధానం చెప్పకుండా సెల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారని చెప్పారు. విద్యార్థులకు టిసిలు ఇస్తే వేరే పాఠశాలలో చేర్పించుకుంటామని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారని తెలిపారు. విద్యాధికారులకు తెలియజేసినా స్పందించడం లేదన్నారు. పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విద్యార్థులకు టిసి ఇప్పించాలని కోరారు. ఇస్మాయిల్, రఘు, రాజు, గని పాల్గొన్నారు.


పట్టణ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు


పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థులు

ఉపాధ్యాయుల కొరత తీర్చాలి

- విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ హైస్కూలులో ఉపాధ్యాయుల కొరత తీర్చాలని విద్యార్థులు గొంతెత్తారు. 'మేమెలా చదువుకునేది' అంటూ విద్యార్థులు శనివారం భోజన విరామ సమయంలో పాఠశాల ముందు బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీనియర్ ఉపాధ్యాయులు గురురాజ్ మాట్లాడారు. 850 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులతోనే విద్యా బోధన చేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా ఇతర పాఠశాలలతో సమానంగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. ఇటీవల తెలుగు బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుని బదిలీ చేయడంతో ముగ్గురు సబ్జెక్ట్ టీచర్లతో మెరుగైన విద్యాబోధన కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్మిషన్ల సమయం, నాడు-నేడు పనుల పరిశీలన, తదితర పనులకు బోధనేతర సిబ్బంది లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడును తిరిగి నియమించాలని విద్యార్థినులు కోరారు. సబ్జెక్టు వారీగా ఉపాధ్యాయులను కేటాయించాలని పలుమార్లు కోరినా స్పందన లేదన్నారు. పేద పిల్లలు చదివే పాఠశాల పట్ల ఉన్నతాధికారులు చిన్న చూపు చూడడం సమంజసం కాదన్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పేందుకు ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు ముక్తకంఠంతో నినదించారు.

తాగునీరందించడమే లక్ష్యం

- ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయికుమార్

ప్రజాశక్తి - పెద్దకడుబూరు


పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ

పెద్దకడుబూరు గ్రామంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు రక్షిత మంచి నీరందించడమే లక్ష్యమని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సాయికుమార్ తెలిపారు. శనివారం పెద్దకడుబూరులోని నాగిరెడ్డి చెరువు, శ్రీరామలింగేశ్వర స్వామి చెరువుల్లో ఉన్న ఎస్ఎస్ ట్యాంకులకు వద్ద ఫిల్టర్ బెల్ట్ మరమ్మతులు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్ఎస్ ట్యాంకులకు వద్ద ఫిల్టర్ బెడ్డును జడ్‌పిటిసి నిధులు రూ.2 లక్షల వ్యయంతో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే నౌలేకల్‌లో రూ.లక్ష, పెద్దకడబూరులోని లక్ష్మీపేట ఎస్సీ కాలనీలో రూ.లక్ష చొప్పున జడ్‌పిటిసి నిధులతో పైపులైన్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు రవిచంద్ర రెడ్డి, మాజీ సర్పంచి సత్యనారాయణ గౌడ్, కల్లుకుంట డీలర్ నర్సింగప్ప, ఉచ్చప్ప, విజయ్ కుమార్ పాల్గొన్నారు.





ప్రతిభ, నగదు పురస్కారాలు పొందిన విద్యార్థినీ విద్యార్థులతో కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్సీలు

ఆదిలోనే కష్టాలు..

- అప్పులు చేసి తెచ్చిపెట్టుకున్న విత్తనాలు, ఎరువులు
- వర్షం కోసం రైతులు ఎదురుచూపు



విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన

ప్రజాశక్తి - కొత్తపల్లి

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. తొలకరి వర్షం పడిన వెంటనే విత్తనాలు వేసుకోవచ్చని ఎదురుచూస్తున్న రైతులకు ఆదిలోనే హంసపాదు ఎదురవుతోంది. వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొంది. సాధారణంగా ప్రతి ఏడాది తొలకరి చినుకులు కురిసిన వెంటనే రైతన్నలు తమ పొలాల్లో విత్తనాలను వేసుకొని పంటల సాగులో నిమగ్నమయ్యేవారు. ఈ ఏడాది కూడా తొలకరి వర్షాలు వస్తాయని వేసవిలో రైతులు పొలాలను దుక్కులు దున్ని, గతంలో వేసిన పంట వ్యర్థాలను తీసివేశారు. పొలాలను సేద్యాలు చేసుకొని సాగుకు సిద్ధం చేసి తొలకరి వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

కొత్తపల్లి మండలంలో రైతులు ఎక్కువ శాతం వర్షాధారంపై ఆధారపడి పంటలు సాగు చేస్తారు. మండలంలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 20 వేల ఎకరాల సాధారణ సాగు భూమి ఉంది. ఇందులో 17.5 వేల ఎకరాల సాగు భూమిని రైతులు పంటలు వేసేందుకు అంతా సిద్ధం చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో రైతులు ఖరీఫ్ సాగు కోసం వేసవిలోనే పొలాలను సిద్ధం చేసుకుని తొలకరి చినుకులు కురిసిన వెంటనే పలు రకాల విత్తనాలు వేస్తారు. అదే క్రమంలోనే ఈ ఏడాది మే నెలలో కురిసిన వర్షాల కారణంగా రైతన్నలు తమ పొలాలను సిద్ధం చేసి తొలకరి చినుకులు పడిన వెంటనే విత్తనాలు వేయాలన్న సంకల్పంతో ఇప్పటికే విత్తనాలను కూడా అప్పులు చేసి తెచ్చి పెట్టుకున్నారు. గ్రామాల్లో ప్రధానంగా మొక్కజొన్న, పత్తి, మిరప, వరి, మునగ, మినుము తదితర పంటలను రైతులు సాగు చేస్తారు. కొందరు రైతులు ఆనవాయితీగా చేర్పులు మార్పులు చేసుకుని పంటలు సాగు చేస్తారు. అయితే ఆదిలోనే వర్షాలు లేక రైతన్నకు కష్టాలు మొదలయ్యాయి. గత సంవత్సరం ఈ సమయంకల్లా మండలంలో రైతులు విత్తనాలు వేయడంతోపాటు వేసిన మొలకలు కూడా వచ్చి వ్యవసాయ పనుల్లో బిజీగా గడిపుతూ ఉన్నారు. ఈ ఏడాది మాత్రం ప్రతిరోజు సాయంత్రం సమయంలో మేఘాలు ఊరిస్తూ వీస్తున్న గాలులకు రైతన్నలు వర్షాలు పడుతాయన్న ఆశతో ఎదురుచూస్తున్నారు తప్ప వర్షాలు మాత్రం పడకపోవడంతో నిరాశ చెందుతున్నారు.వర్షాలు ఆలస్యంగా పడితే పంటలు చేతికొచ్చే సమయంలో వర్షాలు లేకపోతే సరైన దిగుబడి రాక రైతన్నలు నట్టేట మునిగే ప్రమాదం ఉంది. గత సంవత్సరంలో ఈ సమయానికల్లా విత్తనాలు మొలకలెత్తి సుమారు నెల పైరు సాగులో ఉండేదని రైతులు చెబుతున్నారు. జూన్ నెల మధ్యలోకి వచ్చినా నేటికీ పగలంతా విపరీతమైన ఎండలు, వడగాల్పులు వీస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో చిన్న, సన్న కారు రైతులు పొలాలను ముందుగానే గుత్తలు చెల్లించారు. సకాలంలో వర్షాలు రాకపోతే సరైన పంటలు రాక పెట్టు బడుల కోసం చేసిన అప్పులు ఎలా చెల్లించాలోనని కౌలు రైతులు చర్చించు కుంటున్నారు. ఏదేమైనప్పటికీ ప్రకృతి రైతులపై కన్నెర్ర చేయడంతో ఆందోళన పరిస్థితి నెలకొంది.

విద్యతోనే సమూల మార్పులు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్
- 41 మంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పేదరికం నుండి బయట పడటానికి, సమాజంలో సమూల మార్పులు తీసుకురావడానికి విద్య ఒక్కటే ప్రామాణికమని, బడిఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించి చక్కటి విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను కోరారు. శనివారం కలెక్టరేట్‌లోని వైయస్సార్ సెంటినరీ హాలులో జగనన్న ఆణిముత్యాలు కింద జిల్లా స్థాయి ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిధులుగా జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీలు ఇషాక్ బాషా, రామచంద్రారెడ్డి, మార్క్ఫెడ్ ఛైర్మన్ పిపి నాగిరెడ్డి, నంద్యాల, నందికొట్కూరు మునిసిపల్ చైర్మన్లు మాబున్నిసా, సుధాకర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికాన్ని పారదోలేందుకు, సమాజంలో మార్పులు తీసుకొచ్చేందుకు విద్య ఒక్కటే ప్రధాన వనరు అన్నారు. బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన జగనన్న విద్యా కిట్లు పంపిణీ చేశామన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కింద 41 విద్యార్థులను సత్కరిస్తున్నామన్నారు. పదో తరగతిలో జిల్లా టాపర్‌కు రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు నగదు బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన ఒక్కొక్కరికి రూ.50 వేలు నగదు బహుమతి ప్రదానం చేసినట్లు చెప్పారు. ఎమ్మెల్సీ ఇసాక్ భాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించడం ప్రశంసనీయమన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ కార్పోరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. అనంతరం 10వ తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు జిల్లాస్థాయి ప్రతిభా, నగదు పురస్కారాలతో పాటు మెడల్, మెమెంటోలను వారు బహుకరించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరించారు. డిఇఒ సుధాకర్ రెడ్డి, డివిఈఓ సుజాత, డిఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ :** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్ర రెడ్డి అన్నారు. పట్టణంలోని

(మిగతా 6వ పేజీలో..)

30న చలో విజయవాడ

- జయప్రదం చేయండి : రైతు సంఘం

ప్రజాశక్తి - పాములపాడు

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలను ఎండగడుతూ దేశవ్యాప్తంగా రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి పోరాట నిర్వహిస్తుందని, ఢిల్లీకి వినిపించేలా ఈ నెల 30న జరిగే ఛలో విజయ వాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రాజశేఖర్ కోరారు. శనివారం పాములపాడులో నాయకులు ఎంసి నారాయణ అధ్యక్షతన రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర, రాయితీలు ఇవ్వకపోగా ఎరువుల బస్తాల రేట్లు అధికంగా పెంచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నకు, వ్యవసాయానికి ఈ ప్రభుత్వాలు అండగా నిలవాలన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయాలన్నారు. పండించిన పంటలకు ముందస్తు గిట్టుబాటు ధరను ప్రకటించాలన్నారు. స్థానికంగా ఈ ప్రాంతంలో కెసి కెనాల్ పైభాగంలో ఉన్న మెట్ట ప్రాంతానికి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. భానుముక్కల గ్రామంలో సిద్ధాపురం ఎత్తిపోతల ప్రధాన కాలువ పనులు పూర్తి చేయాలని తదితర సమస్యలపై సచివాలయాల ఎదుట నిరసనలు చేపట్టాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. ఈ నెల 30న జరిగే ఛలో విజయవాడ కార్యక్రమానికి రైతులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు బి.రామేశ్వరరావు, వై.నాగేంద్రుడు, మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, జిల్లా కౌలు రైతు సంఘం ఉపాధ్యక్షులు సోమన్న, నాయకులు బాలయేసు, రవణమ్మ, జగన్నాథ రావు, చెన్నయ్య, వెంకటసాయి తదితరులు పాల్గొన్నారు.



అతిసార బారిన 'పలుకూరు'

- 60 మందికి వాంతులు, విరేచనాలు
- పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స
- ఏళ్లు గడుస్తున్నా శుభ్రం చేయని వాటర్ ట్యాంకు

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని పలుకూరు గ్రామంలో ప్రజలు అతిసారాతో అల్లాడిపోతున్నారు. గ్రామంలోని కొత్తపేట కాలనీలో 60 మంది వాంతులు, విరేచనాలతో మంచం పట్టారు. శుక్రవారం రాత్రి 16 మంది వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం నుంచి దాదాపు 44 మంది అనారోగ్యం బారిన పడ్డారు. వీరందరూ నంద్యాల, బనగానపల్లె, పలుకూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలోని శుభ్రం చేయని వాటర్ ట్యాంకు నీళ్లు తాగి వాంతులు, విరేచనాలతో ప్రజల అవస్థలు పడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. వాటర్ ట్యాంకును సంవత్సరాలు గడుస్తున్నా శుభ్రపరచకుండా సరఫరా చేసిన నీటిని తాగడం వల్లే ప్రజలు అతిసార బారిన పడ్డారు. కాలనీలో తాగునీటి పైపులైన్లు మురికి కాలువల్లో వేయడం, పైపుల లీకేజీతో మురికి నీరు అందులోనికి వెళ్లడంతో కలుషితమయింది. ఆ నీరు తాగి వాంతులు, విరేచనాలతో గురైనట్లు కాలనీ ప్రజలు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది. గ్రామపంచాయతీ అధికారులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రత నీరు తాగి ప్రజలు వాంతులు విరేచనాలతో వివిధ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. కొత్తపేట కాలనీకి చెందిన అల్తాఫ్, వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, అమ్మిన, సిద్దు, లచ్చమ్మ, ఎరుకలి సుంకమ్మ, ఎరుకలి రాముడు, హుస్సేనమ్మ, వడ్డే నాగేంద్ర, ఉసేని, దస్తగిరి వీరితో పాటు మరో 47 మంది నంద్యాల, బనగానపల్లె, పలుకూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. గ్రామంలో వాంతులు, విరేచనాలతో ప్రజలు వైద్యశాలలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న నంద్యాల డిఎంహెచ్ఓ వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి మంజుల పలుకూరు గ్రామాన్ని సందర్శించారు. బాధితులకు అందుతున్న వైద్య చికిత్సను అడిగి తెలుసుకున్నారు. క్లోరినేషన్ చేయని ట్యాంకును, లీకేజీ పైప్ లైన్‌లను పరిశీలించారు. ఆర్డబ్ల్యూఎస్ అధికారులు గ్రామపంచాయతీ అధికారులు వాటర్ ట్యాంకును శుభ్రం చేయకపోవడం వలన అతిసార ప్రబలినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. అలాగే వైసిపి రాష్ట్ర కార్యదర్శి గుండంశేషిరెడ్డి, డిపిఓ మంజుల వాణి, ఎంపీడీవో శివరామయ్యలు పలుకూరు గ్రామంలో వాంతులు, విరేచనాలతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే వారికి వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. గ్రామంలో ఎటువంటి అపరిశుభ్రత లేకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఈవో శ్రీనివాసును ఆదేశించారు. రోగులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని తెలిపారు.



బనగానపల్లె వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితులు



క్లోరినేషన్ చేయని ట్యాంకును పరిశీలిస్తున్న డిఎంహెచ్ఓ



మాట్లాడుతున్న అధికారులు

నాణ్యమైన విత్తనాలను వాడాలి

- జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు

ప్రజాశక్తి - బనగానపల్లె : రైతులు నాణ్యమైన విత్తనాలను వాడాలని నంద్యాల జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు తెలిపారు. శనివారం మండలంలోని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రంలో సీనియర్ శాస్త్రవేత్త, యూనిటీ హెడ్ జి.ధనలక్ష్మి అధ్యక్షతన ఇన్‌పుట్ డీలర్స్ శిక్షణా తరగతుల (దేశి శిక్షణా) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో వ్యవసాయం ఖర్చు భారాన్ని తగ్గించడంలో ఇన్పుట్స్ డీలర్స్ పాత్ర ముఖ్యమన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రైతులకు సరఫరా చేయాలని సూచించారు. డీలర్స్ తప్పకుండా పొలాలను సందర్శించి పరిష్కరాలను కచ్చితత్త్వంతో సూచించాలని తెలిపారు. డీలర్స్ అందరూ అవకాశం వినియోగించుకొని విలువలతో కూడిన వ్యాపారం చేయాలని సూచించారు. అనంతరం జి.ధనలక్ష్మి మాట్లాడుతూ డీలర్లు వ్యవసాయంలో వస్తున్న నూతన సాంకేతికతను అందిపుచ్చుకొని రైతులకు చేరవేయాలని సూచించారు. తద్వార వ్యాపార సమర్థ్యంతో పాటు రైతుల ఆదాయం పెంచగలరని సూచించారు. కార్యక్రమంలో దేశీ ప్రోగ్రాం సమన్వయ కర్త, రిటైర్డ్ ఏడిఏ విశ్వనాథ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు రమణయ్య, సుధాకర్, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవి గౌడ్, లక్ష్మి ప్రియ, రుద్రవరం వ్యవసాయ అధికారి శ్రీ కృష్ణ, వివిధ మండలాల డీలర్లు పాల్గొన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీశైల క్షేత్రాన్ని సందర్శించే యాత్రికులకు, భక్తులకు దేవస్థానం కల్పిస్తున్న ఉచిత అన్నదాన పథకానికి శనివారం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన మడిపడిగె నరేష్ గౌడ్ ఒక లక్ష 116 రూపాయలను విరాళంగా అందజేశారు. ముందుగా దాత కుటుంబ సమేతంగా కలిసి స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని దేవస్థానం అధికారులకు అందజేశారు. దాతలకు దేవస్థానం అధికారులు శేష వస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు.

సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామంలో నూతన సిసి రోడ్ల నిర్మాణానికి బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ జనార్దన్ గౌడ్ ఆధ్వర్యంలో శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ బి మురళీకృష్ణారెడ్డి, పబ్బతి రవికుమార్, హాజరయ్యారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బైరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్రిక్తతల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

- ప్రభుత్వ భూమిని మైనింగ్ లీజుకు ఇవ్వరాదు : సుంకేసుల గ్రామస్తులు

ప్రజాశక్తి - అవుకు

అవుకు మండలం సుంకేసుల గ్రామంలో మైనింగ్ లీజుల ప్రజాభిప్రాయ సేకరణ శనివారం ఉద్రిక్తతల మధ్య సాగింది. భారీ పోలీసు బందోబస్తుతో అధికారులు సమావేశాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మండలంలోని సుంకేసుల గ్రామంలో కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ మైనింగ్ భూమి సర్వే నెంబర్ 333/3, 333/2లో సుమారు ఐదు ఎకరాలకు పైగా మైనింగ్ లీజు అనుమతులు పొందేందుకు గ్రామానికి చెందిన మాజీ సర్పంచి చిలకల నారాయణరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం నిర్వహించారు. పర్యావరణ రీజనల్ ఇంజనీర్ ముని ప్రసాద్ మాట్లాడుతూ మైనింగ్ భూములకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్నామని తెలిపారు. గ్రామానికి చెందిన చీకటి రాముడు, వెంకట్రామయ్య, చిన్న వెంకటేశ్వర్లు, కైప వెంకట్రామిరెడ్డి,సేగు శ్రీనివాసులు, చింతమాను చిన్న సుబ్బయ్యలు మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుండి ఇదే సర్వే నంబర్‌లోని ప్రభుత్వ మైనింగ్ భూముల్లో దాదాపు 50 మధ్య తరగతి కుటుంబాలు నాపరాతి గని పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాయని తెలిపారు. ఈ భూములకు సంబంధించి మైనింగ్ లీజులు ఏ విధంగా చేసుకోవాలో కూడా తమకు తెలియదని, తమకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ఎవరికీ తెలియకుండా లీజుకు ఎట్లా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ఈ రెండు సర్వే నెంబర్లలోని భూమిపై కోర్టులో విచారణ జరుగుతోందని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా గనులు చేసుకుంటున్న నిరుపేద కుటుంబాలకు చెందకుండా బడా పారిశ్రామిక వేత్తలకు కట్టబెట్టితే కుటుంబాలతో సహా ఆత్మహత్య చేసుకుంటామని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ విషయంపై మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను కేంద్ర ప్రభుత్వానికి తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎటువంటి అల్లర్లు జరగకుండా బనగానపల్లె సిఐ తిమ్మారెడ్డి, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో సుమారు 60 మంది పోలీసు బలగాలతో పటిష్ట బందోబస్తును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ కార్యవర్గ సభ్యులు, సర్పంచి వెంకట ప్రభావతి, ఎంపిటిసి మేకల రాధమ్మ, ఉప సర్పంచి పార్థసారధి రెడ్డి, మాజీ సర్పంచి చిలకల రామచంద్రారెడ్డి, ఆర్ఐ వెంగళ్రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్న అధికారులు

వైసిపి నుండి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని తోడేండ్లపల్లె గ్రామానికి చెందిన వైసిపి మద్దతుదారులు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, టిడిపి నియోజకవర్గ నాయకులు భార్గవ్ రామ్ సమక్షంలో శనివారం టిడిపిలోకి చేరారు. తోడేండ్లపల్లెకు విచ్చేసిన మాజీ మంత్రి భూమా అఖిలప్రియ దంపతులకు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామానికి చెందిన రామకృష్ణ, రామ్మోహన్, చందు, చిన్న రమణ, ధనలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మిదేవి, చందు ప్రియ, కాత్యాయని, హేమాంజలి, పుల్లమ్మ, ప్రసాద్, రాజేశ్వరి, గుర్రప్పతో పాటు మరో పది కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలోకి చేరారు. వీరికి మాజీ మంత్రి భూమా అఖిలప్రియ దంపతులు టిడిపి కండువా కప్పి సాదారంగా ఆహ్వానించారు. టిడిపి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోకు ఆకర్షితులై పార్టీలోకి చేరామని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లాయర్ నరసింహారెడ్డి, టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు ముల్లా అన్సర్‌బాష, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గుత్తి నర్సింహులు, నియోజకవర్గ ఐ టీడీపీ ఉపాధ్యక్షురాలు శజ్జారెడ్డి, నాయకులు శ్రీనివాసరెడ్డి, జీవన్, హుసేన్‌రెడ్డి, సంజీవరెడ్డి, ఓబులపతి, చౌడన్న, ఇండ్ల లక్ష్మిరెడ్డి, రమణారెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, సల్లా నాగరాజు, కొలిమి హుసేన్‌వళి, షరీఫ్, ఇర్షాద్, గఫార్, సుబ్రమాణ్యం, అబ్దుల్లా ప్రతాప్‌రెడ్డి, రాంపల్లె లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలోకి చేరుతున్న వైసిపి మద్దతుదారులు

సబ్సిడీపై ఐషర్ వాహనం మంజూరు

ప్రజాశక్తి - సంజామల

మత్స్యకార సంఘం వారికి రూ. 13 లక్షల సబ్సిడీతో ఐచర్ వాహనం ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసం వద్ద సంజామల మండలం గిద్దలూరు మత్స్యకార సంఘానికి 24 లక్షల రూపాయల విలువ చేసే ఐచర్ వాహనాన్ని ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వాహనం ద్వారా చేపలు ఇతర ప్రాంతాలకు తరలించడం, దానా లాంటి రవాణా సౌకర్యంకు ఇలాంటి వాహనాలు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. వీటిని మత్స్యకార సంఘం సభ్యులు అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ పోచా శిలారెడ్డి, సంజామల మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, మత్స్యకార సంఘం అధికారి శ్రీనివాసులు, ముక్కుమల్ల షీలా రెడ్డి, గిద్దలూరు మత్స్యకార సంఘం అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, వెంకట ప్రసాద్, పెద్ద వెంకటేశ్వర్లు, రాజశేఖర్, చిన్న రమణ, సంజీవుడు తదితరులు పాల్గొన్నారు.



ఐషర్ వాహనాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



వ్యకాస సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

పోరాటాలతోనే హక్కులు : వ్యకాసం

ప్రజాశక్తి - వెలుగోడు

వ్యవసాయ కూలీలు, మేటీలు ఐక్యంగా పోరాడి హక్కులను సాధించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నరసింహ నాయక్ అన్నారు. శనివారం వెలుగోడులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కోటి సభ్యత్వం గల సంఘం వ్యకాస అన్నారు. నిత్యం వ్యవసాయ కార్మికుల పక్షాన ఉండి పోరాడుతుందని తెలిపారు. కేంద్రంలో బిజెపి వచ్చిన తరువాత ఉపాధి పనిని తుంగలో తొక్కడానికి చూస్తుందన్నారు. ఉపాధి కూలీలకు రావాల్సిన హక్కులను హరించేస్తుందన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని రక్షించుకోవడానికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు ఐక్యంగా పోరాడాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి రెండు వందల పని దినాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వ్యకాసం నాయకులు డేవిడ్, నాగేంద్రబాబు, ఆవాజ్ జిల్లా నాయకులు రఫీక్, మేటీల సంఘం మండల అధ్యక్షులు నూరుల్లా, ఎపి గిరిజన సంఘం మండల అధ్యక్షులు సక్రు నాయక్ పాల్గొన్నారు.

ప్రేమించి మోసం చేశాడు

న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ముందు యువతి ధర్నా

ప్రజాశక్తి - బేతంచెర్ల : బేతంచర్ల మండలం గోర్లగుట్ట గ్రామానికి చెందిన మనోహర్ తనను ప్రేమించి మోసం చేశాడని, న్యాయం చేయాలని యువతి విజయలక్ష్మి శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టింది. బాధితురాలు మాట్లాడుతూ మనోహర్, తాను సంవత్సర కాలంగా ప్రేమించుకున్నామని తెలిపింది. గత రెండు వారాలుగా మనోహర్ బంధువుల ఊరికి వెళ్లి అక్కడే వేరే అమ్మాయిని పెళ్లి చేసుకుని గ్రామానికి వచ్చాడని తెలిపింది. పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరింది. ఎస్సై శివ శంకర్ నాయక్ బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.



పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న యువతి విజయలక్ష్మి



గోడపత్రికను విడుదల చేస్తున్న నాయకులు

శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం : జెవివి

ప్రజాశక్తి - డోన్

జనవిజ్ఞాన వేదిక సభ్యులుగా చేరుదాం, శాస్త్రీయ సమాజాన్ని నిర్మిద్దాం. జనవిజ్ఞాన వేదిక డోన్ డివిజన్ ఆధ్వర్యంలో జెవివి డోన్ అధ్యక్షులు బి.సర్వజ్ఞ మూర్తి అధ్యక్షతన పాతపేట ఉన్నత పాటశాల, డోన్‌లో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రభాకర్, జెవివి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మాణిక్యంశెట్టి మాట్లాడుతూ విద్యావంతులు అందరూ జనవిజ్ఞాన వేదిక సభ్యులుగా చేరి, శాస్త్రీయ సమాజ నిర్మాణంలో పాలు పంచు కావాలని పిలుపు నిచ్చారు. జనవిజ్ఞాన వేదిక అశాస్త్రీయ భావనలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్య వంతం చేస్తుందన్నారు. మూఢ నమ్మకాలకు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా పోరాడుదామన్నారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదికసభ్యత్వ క్యాంపెయిన్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు ఎన్ఎస్. బాబు, రామ మూర్తి, గోపాల్, ఎస్ఎఫ్ఐ విజయ్, అశోక్, సునీల్ , తిమేంద్ర మొదలగు వారు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కథనానికి స్పందన

భైరవాని చెరువును అధికారులు పరిశీలన

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం గోపవరం గ్రామంలోని భైరవాని చెరువులో అక్రమంగా ఎర్రమట్టి రవాణాపై ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన కథనంపై జిల్లా కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి అధికారులు శనివారం భైరవాని చెరువును పరిశీలించారు. చెరువులో అక్రమంగా మట్టిని ఎన్ని క్యూసెక్కులు తీశారని కొలతలు వేసి, డంపింగ్ చేసిన ప్రాంతాన్ని గుర్తించారు. డంపింగ్ చేసిన మట్టిని కూడా కొలతలు వేసి గుర్తించారు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్, జిల్లా నీటిపారుదల అధికారులు, తహశీల్దార్ జనార్దన్ శెట్టి, ఎంపీడీవో శివ నాగజ్యోతి, ఏఎస్ఐ బాలచంద్రుడు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం

ప్రజాశక్తి - మిడుతూరు : మిడుతూరు మండలంలో జగనన్న గృహాల నిర్మాణ పనులు వేగవంతం చేసి పూర్తి చేసుకోవాలని అధికారులు లబ్ధిదారులకు సూచించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని సుంకేసుల గ్రామంలో జగనన్న కాలనీని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రఘురాం, ఎంపిడిఒ జిఎస్ఎన్ రెడ్డి, తహసీల్దార్ ఎస్ ప్రకాష్ బాబు, ఇంచార్జి హౌసింగ్ ఏఈ జె.రమేష్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ మూడు రోజుల్లో బిల్స్ పడుతున్నాయని, త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. జగనన్న కాలనీలలో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లబ్ధిదారులు జులై నెలలోగా ఇల్లు పూర్తి చేసుకుని విద్యుత్ మీటర్లు ఉచితంగా పొందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రఘురాం, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శాంతరాజు, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - నందికొట్కూరు: రైతులకు నాసిరకం విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని టాస్కోర్స్ అధికారి, నంద్యాల వ్యవసాయశాఖ ఏడీఏ రాజశేఖర్ హెచ్చరించారు. శనివారం నందికొట్కూరు పట్టణంలోని విత్తనాలు, ఎరువులు, పెస్టిసైడ్స్ దుకాణాలను నంద్యాల ఏడీఏ డి.రాజశేఖర్, నందికొట్కూరు మండలం వ్యవసాయ శాఖ అధికారి షేక్షావలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మల్లికార్జున, లలిత ,శ్రీనివాస విత్తన ఎరువుల దుకాణాలు తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్లను పరిశీలించారు. అలాగే స్టాక్ రిజిస్టర్, లైసెన్స్, కంపెనీల ఇన్వాయిస్ పత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని విత్తనాల అమ్మకాలను నిలిపివేయాలని దుకాణం యజమానులను ఆదేశించారు.

బోదకాలు నివారణకు జాగ్రత్తలు

ప్రజాశక్తి - ఆత్మకూర్ : బోదకాలు నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు గ్రామీణ ప్రజలకు సూచించారు. నంద్యాల జిల్లా మలేరియా అధికారి కామేశ్వర రావు ఆదేశాల మేరకు డా. సి.గోపాల్ ఆధ్వర్యంలో డా.పవన్ కుమార్ బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వెంకటాపురం, కృష్ణాపురం, సిద్ధపల్లి, నల్లకాలువ, కరివేన గ్రామాల్లో శనివారం బోదకాలు వ్యాధిగ్రస్తులకు ఒక టబ్, సబ్బు, టవల్, ఆయింట్మెంట్ ఉచితంగా అందజేశారు. బోదకాలు వ్యాధిగ్రస్తులు ప్రతి రోజు గోరువెచ్చని నీటిలో బోదకాలు భాగాన్ని టబ్‌లో ఉంచి సబ్బుతో శుభ్రంగా కడిగి, శుభ్రమైన టవల్‌తో తుడిచి ఆయింట్మెంట్ రాసుకుంటూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బైర్లూటి వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్, ఎం ఎల్ హెచ్ పి శివకుమార్, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, శారదమ్మ, ఆశా కార్యకర్తలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కందిపప్పు, చక్కెర ఇవ్వండి సారూ..

ప్రజాశక్తి - కొత్తపల్లి

గ్రామీణ ప్రాంతాల ప్రజలకు రేషన్ డీలర్ల నుంచి ఇంటింటికి రేషన్ వాహనం ద్వారా అన్ని రకాల నిత్యవసర సరుకులు అందించాలి. బియ్యం, జొన్నలు ఇచ్చి కందిపప్పు, చక్కెర ఇవ్వడం లేదు. వాటిని కూడా ఇవ్వాలని గువ్వలకుంట్ల గ్రామంలోని దళిత కాలనీ వాసులు మాణిక్యరావు, సువర్ణమ్మ, ఏసన్న, మరియమ్మలు కోరారు. శనివారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో దళిత కాలనీలో ఇంటింటికి రేషన్ వాహనం వద్ద కాలనీవాసులు నిత్యవసర సరుకులు తీసుకునేందుకు వెళ్లగా అక్కడ బియ్యం, జొన్నలు తప్ప ఏమి ఇవ్వలేదు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బియ్యం, చక్కెర, కందిపప్పు, జొన్నలతో పాటు మరిన్ని సరుకులు ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ఇన్చార్జి తహసిల్దార్ పెద్దన్నను వివరణ కోరగా కారణాలు తెలుసుకొని విచారణ చేసి పరిష్కరిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - చాగలమర్రి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రా రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పిఆర్‌టియు కార్యాలయం వద్ద పిఆర్‌టియు మండల శాఖ రూపొందించిన ఉపాధ్యాయ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో పిఆర్‌టియు మండల అధ్యక్షుడు ఆంజనేయ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మౌలాలి, రాష్ట్ర నాయకులు రవీంద్రారెడ్డి, నారాయణమూర్తి, రషీద్, అహమ్మద్, దాదాపీర్, రవిశంకర్ రెడ్డి, షాకీర్, ఓబులపతి, సురేష్ బాబు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ డైరీని ఆవిష్కరిస్తున్న

విద్యతోనే సమూల మార్పులు

(5వ పేజీ తరువాయి..) ఎద్దుల పాపమ్మ జూనియర్ కళాశాలలో జగనన్న ఆణి ముత్యాల కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా 10వ తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థినీ విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఎంపిపిలు గజ్జల రాఘవేంద్ర రెడ్డి, వసీం, అమర్నాథ్ రెడ్డి, ఎంపీడీవో మహబూబ్ ఖాన్, ఎంఈఓలు శోభా వివేకావతి, అనురాధ, మున్సిపల్ కోఆప్షన్ నెంబర్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. **డోన్ :** విద్యార్థులు కష్టపడి చదివితే ఫలితం సాధించవచ్చని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం పద్మావతమ్మ, సీనియర్ ఉపాధ్యాయులు ఎం. వెంకట సుబ్బారెడ్డిలు అన్నారు. పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం హెచ్ఎం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా ఎఇఇ ప్రభాకర్, హెచ్ఎంలు సురేష్, రామ నర్సప్పలు హాజరయ్యారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సాయికౌశిక్‌కు రూ. 3 వేలు, దాదా సయ్యద్‌కు రూ.2 వేలు, జయ నరసింహకు రూ. వెయ్యి నగదు బహుమతి, మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే హెచ్ఎం పద్మావతమ్మ తన సొంత ఖర్చులతో మొదటి బహుమతి కింద రూ 1000, రెండో బహుమతి రూ.750, మూడవ బహుమతి రూ.500 అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ గౌడ్, ఫోటాన్ సంస్థ అధినేత సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు. **రుద్రవరం :** జగనన్న ఆణిముత్యం కార్యక్రమానికి రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థి ప్రవీణ్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరావు తెలిపారు. ఆళ్లగడ్డలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి చేతుల మీదుగా సి.ప్రవీణ్ రూ.15 వేలు మెరోటీరియస్ సర్టిఫికెట్‌తో పాటుగా విద్యార్థి తండ్రితో పాటు, ఇంఛార్జి ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ సన్మానం అందుకున్నారు. **నందికొట్కూరు :** పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉర్దూ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు సత్కార కార్యక్రమం హెచ్ఎం ఎం.రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ ఫైజునిసా బేగం, 20వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ షేక్ అబ్దుల్ హమీద్ పాల్గొన్నారు. ఎస్. రహమత్ బీకి రూ.3 వేలు, ఎస్.తహరకు రూ.2 వేలు, ఎస్.ఆర్షియాకు రూ. వెయ్యి నగదు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఆళ్లగడ్డ : నగదు బహుమతిని అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

ఎస్‌సి వర్గీకరణ సాధించే వరకూ పోరాటం

- ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

ఎస్సీ వర్గీకరణ సాధించేవరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి, మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్, ఎంఎస్‌పి మాదిగ ఉప కులాలు పోరాటం సాగించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పార్నపల్లి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఫంక్షన్ హాల్‌లో ఎమ్మార్పీఎస్ ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.మొదట ఎమ్మార్పీఎస్ అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగ జాతి, మాదిగ ఉప కులాలు, మాదిగ వికలాంగుల పోరాట సమితి సిద్ధం కావాలన్నారు. న్యాయబద్ధంగా ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని 30 సంవత్సరాల నుండి పోరాటం చేస్తున్నామని, కొన్ని సంవత్సరాలు ఎస్సీ వర్గీకరణ ప్రతిఫలాలను పొందామని, అనంతరం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకవాదులు తమ పలుకుబడితో దేశంలోనే అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో సాంకేతిక కారణాలను చూపి రిజర్వేషన్ను రద్దు చేయించారని ఆరోపించారు. సుదీర్ఘమైన ఎమ్మార్పీఎస్ పోరాటంలో న్యాయమైన కోరికగా అన్ని రాజకీయ పార్టీలు ఆమోదించాయని, అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా ఎమ్మార్పీఎస్ చేస్తున్న పోరాటం న్యాయబద్ధమైనదని శాసనసభలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపారన్నారు. అయినా కేంద్రంలోని ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను చేపటకపోవడం, పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చూపిన పోరాట స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ సాధించేందుకు మాదిగ యువత ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, మేకల దస్తగిరి, కోలా కళ్యాణ్ మాదిగ, మాదిగ జర్నలిస్టుల సంఘం ఫెడరేషన్ నాయకులు, మాదిగ జిల్లా అధికార ప్రతినిధి వెంకటసుబ్బన్న, మాదిగ రాష్ట్ర స్థాయి నాయకులు, మండల కార్యదర్శి శివ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

కులమతాలకతీతంగా పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

వైసిపి పాలనలో పార్టీలకు, కులమతాల కతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పసుపల గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. గ్రామంలో ప్రధాన సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలంటే ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్లీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, ఎంపీపీ మానసవీణ, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ సన్నల జనార్దన్ రెడ్డి, పసుపల గ్రామ సర్పంచ్ మోహన్ బాబు గౌడ్, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, మాజీ ఎంపీటీసీ నాగశేఖరప్ప, ఆకుల నాగలింగప్ప, పెద్ద కులాయి, డి.పాపన్న, బాబయ్య, మద్దిలేటి స్వామి, ఈడిగా పుల్లయ్య గౌడ్, టి రాజేశ్వరప్ప, సి మల్లికార్జునప్ప, ఈడిగా రామయ్య గౌడ్, కంబగిరి, ఎర్రన్న, కంసాలి మౌలానా చారి, మాధవరం పెద్దిరెడ్డి, నారాయణ స్వామి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు, వాలంటీర్లు పాల్గొన్నారు. **చాగలమర్రి :** ఎన్నికల ప్రచారాలలో, మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలన్ని నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. చాగలమర్రి పట్టణంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకు వైసిపి రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, ఎంపిపి వీరభద్రుడు, నాయకులు, కార్యకర్తలు గజమాలతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోహెల్, వైస్ ఎంపిపి రఫి, ఎంపిటీసిలు పత్తి నారాయణ, లక్ష్మిరెడ్డి, ఫయాజ్, చక్రం బీడి షబ్బీర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ జాబీర్, కో ఆప్షన్ సభ్యులు ఇబ్రహీం, షబ్బీర్, ఖాదర్ బాష, బ్రాందీన్, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, జిల్లా సేవాదల్ అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి ,వెంకట రమణ, ఆర్ఎస్ రమణ, గేట్లమాబు, మదార్‌వలి, నాయబ్, ఐడియా బాబు, నాగేంద్ర, రమణారెడ్డి, ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫి, అబ్దుల్లా, పగిడాల బాబు, ఇబ్రహీం, కొండయ్య, ఎంపిడిఓ మహబూబ్‌దౌలా, ఏఓ రంగ నేతాజి, ఎంఈఓ అనురాధ, ఏఈలు కొండారెడ్డి, షాజహాన్, షఫివుల్లా, ఈఓ సుదర్శన రావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



బనగానపల్లె : సంక్షేమ పథకాల బుక్లెట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



చాగలమర్రి: సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే



వైఎస్ఆర్ బీమా పరిహారం అందజేస్తున్న అంబటి చంద్రమోహన్ రెడ్డి

వైఎస్ఆర్ బీమా వరం : వైసిపి

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

వైఎస్ఆర్ బీమా బడుగు బలహీన వర్గాల వారికి వరంలాంటిందని వైసిపి యువ నాయకులు, సచివాలయ కన్వీనర్ అంబటి చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని చింతలాయపల్లి సచివాలయం పరిధిలో షైక్ మాబాష గుండెపోటుతో ఇటీవల మరణించాడు. వైస్సార్ బీమా కింద నామిని షైక్ అజారకు అంబటి చంద్ర మోహన్ రెడ్డి చేతుల మీదుగా రూ. 90 వేలు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ బీమా మంజూరుకు సహకరించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, జడ్పి చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డికి, వైసిపి మండల కన్వీనర్ అంబటి గుర్విరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్ పాల్గొన్నారు.

సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

మండలంలోని పి.లింగాపురం గ్రామంలోని సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు సర్పంచి కేశవరెడ్డి నాగార్జున రెడ్డి, తహశీల్దార్ పుల్లయ్య యాదవ్‌లు శనివారం ప్రారంభించారు. వెన్నం వెంకటసుబ్బమ్మ పేరు మీద మొట్టమొదటి రిజిస్ట్రేషన్ సచివాలయంలో పూర్తి చేసి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలు వ్యయ ప్రయాసలకు ఓర్చి నందికొట్కూరు సబ్ రిజిస్టర్ ఆఫీసుకు ఇక వెళ్ళనవసరం లేదని, ప్రతి రిజిస్ట్రేషన్ సచివాలయంలోనే చేస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రంగారెడ్డి, పంచాయతీ సెక్రటరీ శివశంకర్, తలారి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



కోఆప్షన్ మెంబరా.. మజాకా..!

- మున్సిపల్ షాపునకు బాడుగ కట్టకుండా ఫారం కోళ్ల నిల్వ

- మున్సిపాలిటీ ఆదాయానికి గండి - పట్టించుకోని అధికారులు



అద్దె చెల్లించకుండా కోళ్లు ఉంచిన షాప్

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరు పట్టణంలోని పాత బస్టాండ్‌లో మున్సిపాలిటీకి చెందిన సుమారు 6 షాపులకు సంబంధించి గత ఆరు నెలల క్రితం బహిరంగ వేలం పాట నిర్వహించారు. వాటిలో 5 షాపులు వేలంపాటదారులు దక్కించుకున్నారు. మిగిలిన ఒక్క షాపునకు బాడుగ కట్టకుండా మున్సిపల్ కో ఆప్షన్స్ సభ్యుడు అబ్దుల్ గఫార్ తన చికెన్ షాపుకు చెందిన ఫారం పౌల్ట్రీ కోళ్లను నిల్వ ఉంచుతున్నాడు. షాపులో ఏమాత్రం పరిశుభ్రత పాటించకుండా కోళ్లకు సంబంధించిన దానా, మలవిసర్జనను శుభ్రపరచక పోవడంతో ఇరుగు పొరుగున ఉన్న వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇరుపక్కల తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. కో ఆప్షన్ మెంబర్ తనకున్న రాజకీయ పరిచయాలతో ప్రశ్నించిన వారిని బెదిరించడం పరిపాటిగా మారింది. ఇక మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్‌లకు పలుమార్లు విన్నవించినా సమస్య సద్దుమనగడం లేదని వ్యాపారస్తులు వాపోతున్నారు. మున్సిపాలిటీకి చెందిన ఆస్తులను స్వప్రయోజనాల కోసం వాడుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వేలంపాటలు జరుగుతున్నప్పుడు వేలకు వేలు పెంచి షాపులు దక్కించుకుంటే మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ మాత్రం విరుద్ధంగా రాజకీయ బలాన్ని ఉపయోగించుకొని యదేచ్ఛగా కోళ్ల ఫారం నిర్వహిస్తూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. మున్సిపాలిటీలో కోఆప్షన్ మెంబర్ అయినంత మాత్రాన ప్రజలకు, మున్సిపాలిటీకి ఇబ్బందులు కలిగించేలా వ్యవహరించడం విడ్డూరంగా ఉందంటూ పట్టణ ప్రజలు, వ్యాపారస్తులు, మేధావులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విచారణ చేపట్టి మున్సిపాలిటీకి రావాల్సిన సొమ్మును కో ఆప్షన్ మెంబర్ నుండి రికవరీ చేసి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు, వ్యాపారులు కోరుతున్నారు.

అధికారులు చర్యలు తీసుకోవాలి



కోళ్ల ఫారం నిర్వహణ వల్ల పక్కన ఉన్న వ్యాపారస్తులు, రోడ్డుపై వెళు తున్న ప్రజలు తీవ్ర దుర్వాసన వల్ల ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీకి ఎలాంటి సొమ్మును చెల్లించకుండా అక్రమంగా కోళ్ల ఫారం నిర్వ హించడం ఏమిటి. పురపాలక సంఘానికి చెందిన 6 షాపులను వేలం పాటలో ఎవరెవరు దక్కించుకున్నారు, ఎవరెవరు అగ్రిమెంటు చేయించుకున్నారో తెలపాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

- నాగేశ్వరరావు, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు.

భూమిని అమ్మిన రైతే మళ్లీ తిరగబడుతున్నాడు

- బాధితులు రవికుమార్, సుధాకర్

ప్రజాశక్తి - వెలుగోడు : తమకు భూమి అమ్మిన రైతే తిరిగి అదే పొలం కోసం తిరగబడుతున్నాడని వెలుగోడు పట్టణానికి చెందిన బాధితులు తెలుగు సుధాకర్, రవి కుమార్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... వెలుగోడు పట్టణంలోని రైతు సూర్యనారాయణ రెడ్డికి చెందిన పొలం తెలుగంగ రిజర్వాయర్ నిర్మాణ సమయంలో మునిగి పోయింది. ఇలా అనేకమంది రైతుల పొలాలు పోయాయి. ఇది ఇలా ఉండగా ఇదే తెలుగుంగ రిజర్వాయర్‌కు అనుకొని మిగిలిన పొలంలో సర్వే నెంబర్ 1957/3లో రైతు సూర్యనారాయణ రెడ్డికి చెందిన కొంత పొలాన్ని తెలుగు సుధాకర్, రవి కుమార్ కొన్ని సంవత్సరాల క్రితం గుత్తకు (కౌలు) తీసుకుని సాగు చేసుకుంటున్నారు. తెలుగు సుధాకర్, రవి కుమార్‌లు కొంతమంది మధ్యవర్తులతో కలిసి సూర్యనారాయణ రెడ్డి పొలాన్ని కొనుగోలు చేశారు. ఎప్పుడో కొన్ని సంవత్సరాల క్రితం అమ్మిన పొలాన్ని ప్రస్తుతం సూర్యనారాయణ రెడ్డి మళ్లీ పొలం నాది అంటూ చీటికి మాటికీ వాగ్వాదానికి దిగుతున్నాడని, వేసిన పంట నాశనం అయ్యేలా మందులు పిచికారి చేస్తున్నాడని, న్యాయం చేయాలని బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగన్మోహన్ సూర్య నారాయణ రెడ్డిపై కేసు నమోదు చేశారు. అయితే సోషల్ మీడియాలో సూర్యనారాయణ రెడ్డి తనపై తెలుగు సుధాకర్, రవికుమార్‌లు దాడి చేశారని, ఎస్సై జగన్మోహన్ కూడా బెదిరించాడని పుకార్లు చెక్కర్లు కొట్టాయి. ఈ విషయంపై ప్రజాశక్తి ఎస్ఐని వివరణ కోరగా 'సోషల్ మీడియాలో వస్తున్నవిన వదంతులని మీరే చెబుతున్నారు కదా..? అన్ని సాక్ష్యాలు ఉంటే పంచాయతీ పెత్తందార్ల సమక్షంలో ఎదురెదురుగా కూర్చొని సమస్యను పరిష్కరించుకోమని చెప్పండి. అసలు సూర్యనారాయణ రెడ్డికి సుమారు 65 సంవత్సరాలు ఉంటాయి. స్పందనలో పంపించిన అర్జీలు అన్ని నా దగ్గర ఉన్నాయి. అసలు ఎక్కడా గొడవ జరగనే లేదు. నేనైతే ఎవరినీ బెదిరించ లేదు. ఒకవేళ నేను చెప్పేది అబద్ధం అయితే పోలీస్ స్టేషన్లో ఉన్న సిసి కెమెరాలలో మొత్తం రికార్డు అవుతుంది కదా. ఈ విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. అతనిపై కేసు నమోదు చేశాం' అని ఎస్ఐ తెలిపారు.

ఎర్ర మట్టి దందాను అరికట్టాలి : సిపిఐ

ప్రజాశక్తి - మహానంది : మండలంలోని గోపవరం, గాజులపల్లె గ్రామాలలో అధికారులతో కుమ్మక్కై, ఇసుక, ఎర్ర మట్టి అక్రమ రవాణాను చేస్తున్న వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి దందాను అరికట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా సిపిఎం మండల కార్యదర్శి వీరప్ప అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ నాయుడుకువినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో అక్రమంగా ఇసుక, ఎర్రమట్టిని అధికార పార్టీ నాయకులు జెబిసి, ట్రాక్టర్లతో చెరువులను నుండి తరలిస్తున్నా రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులు పట్టించుకోక పోవడం దారుణ మన్నారు. ఇప్పటికైనా వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలన్నారు. సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు రాముడు పాల్గొన్నారు.

పసుపు నాణ్యతను అధికారులు పరిశీలన

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ఆలమూరు గ్రామంలో నిల్వ ఉంచిన పసుపు పంట నాణ్యతను ఉద్యాన అధికారి నరేష్ కుమార్ రెడ్డి, మార్క్‌ఫెడ్ అధికారి బ్రహ్మానంద రెడ్డిలు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలమూరు గ్రామంలో 79 మంది రైతులు పసుపు కనీస మద్దతు ధరకు ప్రభుత్వానికి అమ్ముకోవడానికి రైతు భరోసా కేంద్రంలో సిఎం యాప్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. పసుపు పంట నాణ్యతను, నిల్వ ఉంచిన ప్రదేశాలను పరిశీలించామన్నారు. వారి వెంట ఆర్‌బికే సిబ్బంది, గ్రామ రైతులు ఉన్నారు.

విత్తన దుకాణాలను ఎఒ తనిఖీ

ప్రజాశక్తి - ఆత్మకూరు : మండలంలోని విత్తన దుకాణాలను మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. విత్తన నిల్వలను, స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అనుమతి ఉన్న కంపెనీల విత్తనాలను మాత్రమే విక్రయించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లును ఇవ్వాలని తెలిపారు. బిల్లుపై తప్పనిసరిగా విత్తన వివరాలు, లాట్ నెంబర్ నమోదు చేయాలన్నారు. అనుమతి లేని కంపెనీల విత్తనాలను అమ్మినా, గ్రామాలలో అనధికారికంగా విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఐటిఐ కళాశాలకు డిజిటి అనుమతి

ప్రజాశక్తి - బేతంచర్ల : బేతంచర్లలోని శ్రీ శేషారెడ్డి హైస్కూల్ ప్రాంగణంలో నడుస్తున్న ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు డిజిపి న్యూఢిల్లీ వారి అనుమతి లభించిందని కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ శనివారం తెలిపారు. ప్రిన్సిపల్ రాట్లాడుతూ ఐటిఐ కాలేజీలలో చదివే విద్యార్థులకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, ట్రేడ్‌లకు డిజిటి న్యూఢిల్లీ వారి అనుమతి లభించిందన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎంపిపి బుగ్గన నాగభూషణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అనుమతి పత్రాలను అందజేశారు. కళాశాల సిబ్బంది సురేష్ కుమార్, మనోహర్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - చాగలమర్రి : రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి సుభిక్షంగా ఉండాలని కర్నూలు జిల్లా కోడుమూరు యువకులు తిరుమలకు చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం చాగలమర్రికి చేరుకుంది. కోడుమూరుకు చెందిన హరికృష్ణ, రాము, లక్ష్మన్న, మధు, శంకర్, రాజేష్‌తో పాటు మరో 25 మంది సైకిల్ యాత్ర ఈ నెల 16న కోడుమూరు నుంచి చేపట్టారు. సైకిల్ యాత్ర ఈ నెల 18న తిరుమలకు చేరుకొని వెంకటేశ్వర స్వామికి మొక్కు తీర్చుకుని తిరుగు ప్రయాణం చేపడతామన్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తపల్లి : మండలంలోని చిన్న గుమ్మడాపురం గ్రామానికి చెందిన కట్టుబడి రంగస్వామి (58) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. రంగస్వామి గత 30 సంవత్సరాల నుండి జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలో నివసిస్తున్నాడు. 6 నెలల క్రిందట మోటార్ సైకిల్ పై నుంచి కిందపడి కుడికాలు సడుగులో విరిగింది. అప్పటినుంచి చికిత్స చేయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం ఒక్కడే చిన్న గుమ్మడ పురం గ్రామానికి వచ్చాడు. బంధువులను, తెలిసిన వ్యక్తులని కలుసుకొని మాట్లాడిన తర్వాత మద్యం సేవించి పశువుల కొట్టంలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హరగోపాల్‌పై ఉపా కేసు అక్రమం

ప్రజాశక్తి-డోన్ : పౌర హక్కుల నేత హరగోపాల్‌పై ఎన్ఐఎ పెట్టిన ఉపా కేసు అక్రమమని సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా నాయకులు కె రంగనాయకులు ఖండించారు. శనివారం ఆయన మాట్లాడుతూ హర గోపాల్‌పై బనాయించిన అక్రమ ఉపా కేసును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు దొరపల్లి రాజు, శ్రీరాములు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంట ముందు వరకూ ఆన్‌లైన్‌లో సేవల టికెట్లు

ప్రజాశక్తి - శ్రీశైలం : శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి సేవలు ప్రారంభానికి గంట సమయం ముందు వరకూ సేవల టికెట్లు ఆన్‌లైన్‌లో పొందే అవకాశం కల్పించినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల మే 1వ తేదీ నుండి అన్ని ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనం టికెట్లు అన్ని ఆన్లైన్లోనే జారీ చేస్తున్నట్లు చెప్పారు. జూన్ మాసానికి సంబంధించిన ఆర్జిత సేవలు, స్పర్శ దర్శనం టికెట్లు అన్ని మే 25 నుంచి ఆన్లైన్లో ఉంచామన్నారు. ప్రతి నెల 25వ తేదీన రాబోయే మాసానికి సంబంధించిన టికెట్లు అన్నీ జారీ చేస్తున్నట్లు తెలిపారు. దేవస్థానం వెబ్సైట్ www.srisailadevasthanam.org ద్వారా భక్తులు ఆయా ఆర్జితసేవ టికెట్లను పొందాలన్నారు.

ఈ-స్టాంప్ సేవల కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - నందికొట్కూరు : నందికొట్కూరు పట్టణంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏర్పాటైన ఈ స్టాంప్ ఉమ్మడి సేవల కేంద్రాన్ని సబ్ రిజిస్ట్రార్ చంద్రమౌళి శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ జ్యుడీషియల్ ఈ-స్టాంపులు ఈ కేంద్రంలో అందుబాటులో ఉంటాయని, నాన్ జ్యుడీషియల్ స్టాంపుల బదులు ఈ- స్టాంపులు జారీ చేస్తారని తెలిపారు. స్టాంపుల ముద్రణ, సరాఫరా వల్ల కాలయాపన జరగకుండా ఈ విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. సిఎస్సి నిర్వాహకుడు అబ్దుల్ హక్ మాట్లాడుతూ నాన్ జ్యుడీషియల్ స్టాంపుల కొరతకు ఈ' స్టాంపింగ్‌తో చెక్ పెట్టవచ్చన్నారు. అగ్రిమెంట్లు చేసుకునేందుకు వీలుగా అఫిడవిట్లు ఇవ్వడానికి, రుణ అగ్రిమెంట్లు తదితర అగ్రిమెంట్లకు ఈ స్టాంపులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సిఎస్సి సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

ప్రజాశక్తి - నందికొట్కూరు : పట్టణంలోని మారుతి నగర్ కాలనీలో నివాసం ఉంటున్న గుర్రం రామలక్ష్మమ్మను గొంతు కోసి దారుణంగా హత్య చేసిన ఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గుర్రం బాలయ్య, గుర్రం రామలక్ష్మమ్మలకు ఇద్దరు కుమారులు. గుర్రం రామలక్ష్మమ్మ ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుండుగులు వచ్చి గొంతు కోసి హత్య చేశారు. సంఘటన తెలుసుకున్న పట్టణ సీఐ ఓ.విజయభాస్కర్, ఎస్సై ఎన్వి రమణ అక్కడికి చేరుకొని డిఎస్పి శ్రీనివాసరావుకు విషయం తెలియజేశారు. డిఎస్పి తనిఖీ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.